TARAJYOTHI TELUGU DAILY

తారాజ్యోతి

తెలుగుదిన పత్రిక

చీఫ్ ఎడిటర్ : డాక్టర్ జె.బి.ఎల్

బుధవారం, అక్టోబర్ 14, 2026 | సంపుటి - 21 | సంచిక 04 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.

'మళ్లీ దాడులు చేస్తే.. వాటిని ధ్వంసం చేస్తాం'

అమెరికాకు ఇరాన్ వార్నింగ్

టెహ్రాన్ : అమెరికా మళ్లీ తమపై దాడులు మొదలు పెడితే ఈసారి కేబుళ్లు, డేటా సెంటర్లు, ఏఐ కేంద్రాలతోపాటు ఇతర సైట్లను లక్ష్యంగా చేసుకుంటామని ఇరాన్ హెచ్చరించింది. పశ్చిమాసియా యుద్ధాన్ని ముగించటానికి హర్మూజ్ జలసంధిని పూర్తిగా తెరవటానికి జరుగుతున్న చర్చల్లో అమెరికా చేసిన తాజా ప్రతిపాదనలు ఏమాత్రం సరిపోవని తెలిపింది. ఈమేరకు ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ చీఫ్, మాజీ కమాండర్ హోస్సేన్ రెజాయ్ మాట్లాడుతూ ఒప్పందం విషయంలో అమెరికా 2లో

బలహీన వర్గాలకి అధికారం ఇష్టపడని గొడ్డలి పార్టీ

మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

నెల్లూరు, అక్టోబర్ 13: రాష్ట్రంలో గొడ్డలి పార్టీకి రాజ్యాంగం, ప్రజాస్వామ్య వ్యవస్థలపై నమ్మకం లేదని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి మండిపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఏపీ హైకోర్టులో వైసీపీ మరో రెండు పిటిషన్లు దాఖలు చేసింది. వైసీపీ చర్యలపై ఆయన తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంగళవారం మంత్రి ఆనం మాట్లాడుతూ.. ప్రజలపై రప్ప రప్ప భాషతో బెదిరింపులకి పాల్పడుతున్నారని వైసీపీ నాయకులపై నిప్పులు చెరిగారు. తన రాజకీయ చరిత్రలో ఇలాంటి పార్టీని ఎప్పుడు చూడలేదని అన్నారు. బలహీన వర్గాలకి అధికారం రావడం గొడ్డలి పార్టీ వాళ్లకి ఇష్టం లేదని చెప్పారు. సీఎం చంద్రబాబు బలహీన వర్గాలకు 34 శాతం రిజర్వేషన్ కల్పించారని పేర్కొన్నారు. బలహీన వర్గాలకు అధికారం రాకుండా గొడ్డలి పార్టీ అడ్డుకుంటుందని మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి విమర్శించారు.

బీసీల రక్షణ కోసం

త్వరలో కొత్త చట్టం

మంత్రి కొల్లు రవీంద్ర

అమరావతి : బీసీలకు రక్షణ కల్పించేందుకు త్వరలో బీసీ రక్షణ చట్టం తీసుకొస్తున్నట్లు భూగర్భ గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. బీసీల రాజకీయ, ఆర్థిక, విద్య సాధికారతకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. మంగళవారం రాజధాని అమరావతిలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. ఆనాడు అన్న ఎన్టీఆర్ బీసీలకు 20 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే.. వాటిని నేడు సీఎం చంద్రబాబు నాయుడు 34 శాతానికి పెంచారని వివరించారు. కూటమి ప్రభుత్వం స్థానిక సంస్థల్లో బీసీలకు 40 శాతానికిపైగా రాజకీయ ప్రాతినిధ్యం కల్పిస్తుందని వివరించారు. వైసీపీ పాలనలో బీసీ రిజర్వేషన్లు 34 శాతం నుంచి 24 శాతానికి కుదించారని మండి పడ్డారు. దీంతో 16,800 మంది బీసీలు తరువాయి 2లో

సింగరేణి కార్మికులకు,

ఉద్యోగులకు దసరా కానుక

- ఒక్కొక్కరికి రూ.1,53,912 లాభాల వాటా
- 38,737 మంది పర్మినెంట్ ఉద్యోగులకు లబ్ధి
- 29,717 మంది కాంట్రాక్టు కార్మికులకు రూ.5,500 బోనస్
- సింగరేణి కార్మికుల సొంతింటి కలను సాకారం చేస్తాం
- పెండింగ్ డిపెండెంట్ ఉద్యోగాల సమస్యలకు 15 రోజుల్లో పరిష్కారం
- కార్మికుల సమస్యల పరిష్కారానికి మానవీయ దృక్పథం
- మీడియాతో ప్రకటించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క
- సింగరేణిని భ్రష్టు పట్టించిన బీఆర్ఎస్.. ఇప్పుడు పోరుబాట హాస్యాస్పదం: మంత్రి శ్రీధర్‌బాబు?
- సమస్యలు పరిష్కరించని వారు ఇప్పుడు ఏం సాధిస్తారు

హైదరాబాద్ : సింగరేణి బొగ్గు గని కార్మికులకు దసరా పండుగ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం తీపి కబురు అందించింది. సింగరేణి సంస్థలో పనిచేస్తున్న పర్మినెంట్ ఉద్యోగులకు లాభాల వాటా కింద ఒక్కొక్కరికి సగటున రూ.1,53,912 చెల్లించనున్నట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. ?ప్రజాభవన్‌లో మంగళవారం మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబుతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో డిప్యూటి సిఎం మాట్లాడుతూ మొత్తం 38,737 మంది పర్మినెంట్ ఉద్యోగులు ఈ నిర్ణయంతో ప్రయోజనం పొందనున్నారని, 29717 మంది కాంట్రాక్టు కార్మికులకు ఒక్కొక్కరికి రూ.5,500 చొప్పున దసరా బోనస్ చెల్లించనున్నట్లు తెలిపారు. గతంలో మాదిరిగానే ఈ ఏడాది కూడా సింగరేణి లాభాల్లో 34 శాతాన్ని కార్మి కులకు లాభాల వాటాగా అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందని భట్టి విక్రమార్క వెల్లడించారు. సింగరేణి ఆర్జించిన 1754 కోట్ల నికర లాభాల్లో 34 శాతం అంటే 596 కోట్ల రూపాయ లను లాభాల వాటాగా కార్మి కులకు పంపిణీ చేయనున్నట్లు వివరి ంచారు. పర్మినెంట్ ఉద్యోగులతో పాటు కాంట్రాక్టు కార్మికుల సంక్షేమానికి కూడా ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొ న్నారు. గత ఏడాది కాంట్రాక్టు కార్మికులకు రూ.5,500 బోనస్ అందిం చామని, ఈ ఏడాది కూడా అదే మొత్తాన్ని చెల్లించాలని నిర్ణయించినట్లు వివరించారు. 2లో



సీఈసీలకు పద్మ అవార్డుల్ని కాంగ్రెస్

లంచాలుగా ఇచ్చింది

కేంద్ర మంత్రి పీయూష్ సంచలన ఆరోపణ

న్యూఢిల్లీ : సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాల్సిందే అంటూ నిరసన చేపట్టిన కాంగ్రెస్ పార్టీపై కేంద్ర మంత్రి, బీజేపీ అగ్రనేత పీయూష్ గోయల్ సంచలన ఆరోపణలు చేశారు. గతంలో పని చేసిన సీఈసీలకు కాంగ్రెస్ లంచాలు ఇచ్చిందన్నారు. ప్రతిష్టాత్మక పద్మ అవార్డుల్ని సీఈసీలకు లంచంగా ప్రకటించిందని పీయూష్ విమర్శించారు. అలాగే, వారికి రాజకీయ పదవులు కూడా ఇచ్చిందని ఆయన గుర్తు చేశారు. పీయూష్ గోయల్ మంగళవారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా సంచలన ఆరోపణలు చేశారు. సీఈసీలకు, ఈసీలకు కాంగ్రెస్ పదవులు ఇచ్చిందన్నారు. మాజీ సీఈసీ ఎంఎస్ గిల్.. ఎన్నికల సంఘం నుంచి పార్లమెంట్‌కు, అక్కడినుంచి కేంద్ర మంత్రిగా మారిన సంగతిని గోయల్ వివరించారు. అంతకుముందు సీఈసీగా కొనసాగిన టీఎన్ శేషన్ పదవీకాలం ముగిసిన వెంటనే గుజరాత్ గవర్నర్‌గా నియమించారని గోయల్ ప్రస్తావించారు. 2005లో కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు నవీన్ చావ్లాను ఎన్నికల కమిషనర్‌గా నియమించడంలో సోనియా గాంధీ పాత్ర లేదా అని ప్రశ్నిం చారు. ఎన్నికల కమిషనర్‌గా ఉన్న చావ్లా కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని 2009లో ప్రధాన ఎన్నికల కమిషనర్ ఎన్.గోపాలస్వామి ఆరోపించిన 2లో

చినిగిపోని.. తడిసినా చెడిపోని

మీ సేవ సర్టిఫికెట్లు

- 15 అత్యాధునిక భద్రతా ఫీచర్లతో కొత్త పేపర్
- ఏళ్ల తరబడి భద్రంగా దాచుకునేలా ప్రత్యేక తయారీ
- మీసేవలో జారీ చేసే సర్టిఫికెట్లకు ఇక లామినేషన్ పని లేదు
- ప్రజాభవన్‌లో ప్రారంభించిన ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

హైదరాబాద్ : ప్రభుత్వ ధ్రువపత్రాల భద్రత, మన్నిక పెంచే దిశగా తెలంగాణ ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. చినిగిపోకుండా, నీళ్లు పడినా దెబ్బతిన కుండా ప్రత్యేకంగా రూపొందించిన కొత్త మీ సేవ సర్టిఫికెట్ పేపర్‌ను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మంగళ వారం ప్రారంభించారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు రాజ్ ఠాకూర్, విజయ రమణారావు తరువాయి 2లో

విద్యతోనే సమాజాభివృద్ధి

- ప్రపంచంతో పోటీపడేలా తెలంగాణ విద్యారంగం
- విద్యకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పెద్దపీట
- ఉపాధ్యాయులే భావి తరాల నిర్మాతలు..
- 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యంలో భాగస్వాములు కావాలి: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

హైదరాబాద్ : విద్య ద్వారానే సమాజంలో సామాజిక, ఆర్థిక అసమానతలను అధిగమించి అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించడం సాధ్యమవుతుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. విద్యారంగానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తూ, భారీగా నిధులు కేటాయించడంతోపాటు విప్లవాత్మక సంస్కరణలు చేపడుతోందని తెలిపారు. ప్రపంచంతో పోటీపడే స్థాయిలో తెలంగాణ విద్యార్థులను తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. హైదరాబాద్ పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్లో జీ తెలుగు న్యూస్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'గురు వందనం--ఎడ్యుకేషన్ కాంక్లేవ్ అండ్ టీచర్స్ అవార్డ్స్--2026' కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పాల్గొని మాట్లాడారు. సమాజాభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని, విద్యార్థులను ఉన్నతమైన మానవ వనరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు మరింత చురుగ్గా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సమాజంలో విద్య ఎంతగా అభివృద్ధి చెందితే, ఆ సమాజం అన్ని రంగాల్లో అంతగా పురోగమిస్తుందని శాస్త్రీయ అధ్యయనాలు తరువాయి 2లో

పోస్టుమెట్రిక్ విద్యార్థులకు

రూ.204.40 కోట్ల భరోసా

- 32,976 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్ నిధుల విడుదల
- హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ ఫీజు బకాయిలకు మరో రూ.14.68 కోట్లు

హైదరాబాద్ : రాష్ట్రంలోని ఎస్సీ విద్యార్థుల విద్యాభ్యాసానికి ఆర్థిక ఇబ్బందులు అడ్డంకిగా మారకుండా ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా 2026--27 విద్యా సంవత్సరానికి సంబంధించి పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్‌ల కింద 32,976 మంది విద్యార్థులకు మొత్తం రూ.204.40 కోట్ల నిధులు విడుదలయ్యాయి. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం తన 40 శాతం వాటాగా రూ.101.44 కోట్లు, కేంద్ర ప్రభుత్వం 60 శాతం వాటాగా రూ.102.96 కోట్లు విడుదల చేసినట్లు సంక్షేమ శాఖ మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. విద్యార్థుల ఉన్నత విద్యకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. 2లో

‘మళ్లీ దాడులు చేస్తే.. వాటిని ధ్వంసం చేస్తాం’

మరికొన్ని అంశాలపై ముందు స్పష్టత ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఒకవేళ యుద్ధం తీవ్ర స్థాయికి చేరితే ఈ ప్రాంతం లోని కేబుల్స్, డేటా సెంటర్లు, ఏఐ కేంద్రాలతోపాటు ఇతర సైట్లపై దాడులు చేస్తామని రెజాయ్ హెచ్చరించారు. ాశ్రీంశీ =ఖుఎ - ఈ నెల 20 వరకు సాయుధ బలగాలను అక్కడే ఉంచండి.. ాఎజవతీఅంవఎవత్ హర్మూజ్ లో నౌకలపై దాడులు హర్మూజ్ జలసంధి ప్రాంతంలో రెండు వాణిజ్య నౌకలపై జరిగిన దాడులను భారత్ తీవ్రంగా ఖండించింది. ఈ దాడుల్లో ఎంటీ పెట్రో డాల్ఫిన్ నౌకలోని ఇద్దరు భారతీయ నావికులు గల్లంతయ్యారు. మరో నౌక ఎంటీ వాల్తేరాపై గుర్తు తెలలియని క్షపణి దాడితో మంటలు చెలరేగాయి. ఈ ఘటనపై భారత్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ ఘర్షణలకు చర్చలు, దౌత్య మార్గాల ద్వారా పరిష్కారం కనుగొనాలని సూచించింది.

సీఈసీలకు పద్మ అవార్డుల్ని కాంగ్రెస్ లంచాలుగా ఇచ్చింది

విషయాన్ని కూడా గోయల్ గుర్తు చేశారు. ఇదే సమయంలో ఇటీవల సీఈసీ రాజీనామా విషయంలో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేస్తున్న విమర్శల్ని, ఆయన తీరును పీయూష్ గోయల్ తప్పుబట్టారు. రాహుల్ ప్రవర్తన ద్వంద్వ ప్రమాణాలను సూచిస్తోందని, చిన్న పిల్లాడిలా ఆయన ప్రవర్తన ఉందని విమర్శించారు. ఎన్నికల సంఘానికి తమ ఎన్డీయే ప్రభుత్వం పూర్తి స్వతంత్రంగా పని చేసే స్వేచ్ఛ ఇచ్చిందన్నారు. ఎన్నికల సంఘం కమిషనర్ల నియామకంలో ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తావు ఇవ్వలేదని వివరించారు. చట్టపరమైన నిబంధనల్ని ఉల్లంఘించి, రాజకీయ ప్రయోజనాలు పొందేందుకు ప్రయత్నించలేదన్నారు. ప్రజల కోసం నిజాయితీగా పని చేసేలా చూశామని గోయల్ తెలిపారు.

పోస్టుమెట్రిక్ విద్యార్థులకు రూ.204.40 కోట్ల భరోసా

కళాశాలల నుంచి అందుతున్న పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్ దరఖాస్తులను ప్రభుత్వం ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, అర్హత ఉన్న విద్యార్థులకు దశలవారీగా స్కాలర్‌షిప్ మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ఆర్థిక ఇబ్బందులు తలెత్తకుండా, స్కాలర్‌షిప్‌ల చెల్లింపులు సకాలంలో జరిగేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి ఆదేశించారు. విద్యకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఆర్థిక పరిస్థితులు కారణంగా ఏ ఒక్క ఎస్సీ విద్యార్థి ఉన్నత విద్యకు దూరం కాకూడదన్న లక్ష్యంతో ప్రభుత్వం సంక్షేమ పథకాలను సమర్థంగా అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని స్కాలర్‌షిప్ ప్రక్రియలో జాప్యాన్ని తగ్గించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అర్హులైన ప్రతి విద్యార్థికి ప్రభుత్వ సహాయం అందేలా వ్యవస్థను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని పేర్కొన్నారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌కు రూ.14.68 కోట్లు ఇదిలా ఉండగా, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌కు సంబంధించి పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిల చెల్లింపుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.14.68 కోట్లను విడుదల చేసింది. విద్యార్థుల విద్యకు సంబంధించిన ఫీజు బకాయిలను పరిష్కరించడంలో ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతోందని మంత్రి తెలిపారు. విద్యార్థుల విద్య, సంక్షేమానికి అవసరమైన నిధులను సమకూర్చడంతో పాటు, అర్హులైన ప్రతి విద్యార్థికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు చేరేలా తెలంగాణ ప్రభుత్వం నిరంతరం చర్యలు చేపడుతోందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ స్పష్టం చేశారు.

చినిగిపోని.. తడిసినా చెడిపోని మీ సేవ సర్టిఫికెట్లు

ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ కమిషనర్ టి. రవికిరణ్, అధికారులు, ప్రింటింగ్ ఏజెన్సీలు, సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. 15 అత్యాధునిక భద్రతా ఫీచర్లు కొత్త మీ సేవ సర్టిఫికెట్ పేపర్‌లో 15 అత్యాధునిక భద్రతా ఫీచర్లను పొందుపరిచారు. నకిలీ సర్టిఫికెట్ల తయారీ, అనధికార నకళ్లను అరికట్టేలా వీటిని రూపొందించారు. భద్రతా కారణాలతో ఈ ఫీచర్ల పూర్తి వివరాలను వెల్లడించడం లేదు. ప్రత్యేక సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేసిన ఈ పేపర్ సులభంగా చినిగిపోదు. నీళ్లు పడినా త్వరగా దెబ్బతినదు. సాధారణ వినియోగం, మడతపెట్టడం, ఎక్కువ కాలం భద్రపరచడం వల్ల కలిగే నష్టాన్ని తగ్గిస్తుంది. దీంతో సర్టిఫికెట్లను ఏళ్ల తరబడి మంచి స్థితిలో దాచుకునే అవకాశం ఉంటుంది. సాధారణ పరిస్థితుల్లో వాటికి లామినేషన్ చేయించాల్సిన అవసరం కూడా తగ్గుతుంది.జీవితాంతం అవసరమయ్యే పత్రాలకు మరింత రక్షణ ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ జనన, మరణ ధ్రువపత్రాలతో పాటు విద్య, ఉద్యోగ, ఇతర అధికారిక అవసరాలకు ఉపయోగించే సర్టిఫికెట్లు ప్రజల జీవితంలో ఎంతో ముఖ్యమైనవని పేర్కొన్నారు. కొన్ని పత్రాలను జీవితాంతం భద్రంగా ఉంచుకోవాల్సి ఉంటుందన్నారు. అలాంటి ధ్రువపత్రాలు త్వరగా పాడవకుండా చూడటంతో పాటు వాటి విశ్వసనీయతను కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. ప్రజలకు అందించే ప్రభుత్వ సేవల్లో నాణ్యత, భద్రత, సౌలభ్యాన్ని మరింత పెంచే దిశగా ఆధునిక సాంకేతికతను వినియోగిస్తున్నామని మంత్రి వివరించారు. కొత్త సెక్యూరిటీ పేపర్‌తో సర్టిఫికెట్ల మన్నిక పెరగడంతో పాటు నకిలీలను అరికట్టేందుకు వీలవుతుందన్నారు. ప్రభుత్వ ధ్రువపత్రాలపై ప్రజల్లో విశ్వాసం మరింత పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. 2011 నుంచి మీ సేవ సెక్యూరిటీ పేపర్.. తెలంగాణలో మీ సేవ కేంద్రాల ద్వారా ప్రజలకు అనేక రకాల ప్రభుత్వ సేవలు అందుతున్నాయి. 2011 నుంచి మీ సేవ సర్టిఫికెట్ల ముద్రణకు ప్రత్యేక సెక్యూరిటీ పేపర్‌ను వినియోగిస్తున్నారు. ఇప్పటివరకు ఉన్న పేపర్ స్థానంలో మరింత నాణ్యత, భద్రత, మన్నిక కలిగిన కొత్త పేపర్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. ముఖ్యంగా జనన, మరణ ధ్రువపత్రాలతో పాటు దీర్ఘకాలం భద్రపరచాల్సిన ఇతర ప్రభుత్వ పత్రాలకు ఇది ఎంతో ఉపయోగపడనుంది.

బీసీల రక్షణ కోసం త్వరలో కొత్త చట్టం

రాజ్యాంగబద్ధమైన పదవులకు దూరం అయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ రిజర్వేషన్ల కోసం కూటమి ప్రభుత్వం ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేసి సర్వే నిర్వహించిందని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికలు జరగకపోతే రూ.12,500 కోట్ల ఆర్థిక సంఘం నిధులు కోల్పోయే ప్రమాదం ఉందని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. కల్లు గీత కార్మికులకు మద్యం దుకాణాల్లో 10 శాతం కేటాయింపులు చేసినట్లు గుర్తు చేశారు. చేనేత కార్మికులకు నేతన్నల సేవలో.. పథకం ద్వారా ఏటా రూ.25 వేల సాయంతోపాటు వారి మగ్గాలకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని అన్నారు. మత్స్యకారుల హక్కుల పరిరక్షణకు జీవో నంబర్ 217 రద్దు చేశామని తెలిపారు. వారి సంక్షేమం కోసం మత్స్యకారుల సేవలో పథకాన్ని అందిస్తున్నామని వివరించారు. గత వైసీపీ పాలనలో బీసీ నాయకత్వాన్ని అణచివేసే ప్రయత్నాలు జరిగాయని మంత్రి కొల్లు రవీంద్ర చెప్పారు.

మంథనిలో అక్రమంగా తరలిస్తున్న 11 ఆవులు పట్టివేత

మంథని : పెద్దపల్లి జిల్లా మంథని పట్టణంలోని కూచిరాజపల్లి వద్ద అక్రమంగా తరలిస్తున్న 11 ఆవులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. రెండు చిన్న ట్రాలీలలో ఆవులను కరీంనగర్‌కు తరలిస్తుండగా పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వివరాల ప్రకారం.. ములుగు జిల్లా మల్లంపల్లి గ్రామానికి చెందిన ఇస్లావత్ సోమన్న, ఎండీ తుఫాన్ కలిసి 11 ఆవులను రెండు చిన్న ట్రాలీలలో కరీంనగర్‌కు తరలిస్తున్నారు.

సింగరేణి కార్మికులకు, ఉద్యోగులకు దసరా కానుక

సింగరేణి ఉద్యోగ, కార్మికులకు సొంతింటి కల సాకారం ”సింగరేణి ఉద్యోగులు, కార్మికుల సొంతింటి కలను సాకారం చేస్తాం. కార్మికుల సంక్షేమం, వారి కుటుంబాల భవిష్యత్తుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తాం. ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న కార్మికుల సమస్యలను పరిష్కరించి, వారికి న్యాయం చేస్తాం. సింగరేణి కార్మికులకు సొంత ఇళ్లు నిర్మించుకునే అవకాశం కల్పించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నాం. సింగరేణి సంస్థకు చెందిన భూముల్లో ఇప్పటి వరకు మైనింగ్ చేపట్టని ప్రాంతాలను గుర్తించి, అక్కడ ఇళ్ల నిర్మాణానికి అనువైన లేఅవుట్లు సిద్ధం చేయాలి. మిశ్రమ ఆర్థిక విధానాలను ప్రోత్సహించి ప్రభుత్వ రంగ సంస్థలను ప్రోత్సహించిన భారత తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ పేరిట నెహ్రూ హౌసింగ్ కాలనీ ఏర్పాటు చేసే దిశగా కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులకు సూచించాం. సింగరేణి నుంచి రెవెన్యూ శాఖకు తిరిగి అప్పగించిన 5,774 ఎకరాల భూముల్లో 4,500 ఎకరాలను గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేదలకు పట్టాల రూపంలో అందించారు. మిగిలిన సుమారు 1,250 ఎకరాలకు సంబంధించి జీవో నంబర్ 76 ప్రకారం అర్హులకు ఇళ్ల స్థలాల పట్టాలు అందించే ప్రక్రియను వేగవంతం చేయాలని” సింగరేణి యాజమాన్యాన్ని ఆదేశించామని తెలిపారు. సింగరేణిలో ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న సుమారు 250 నుంచి 300 డిపెండెంట్ ఆర్డర్లు, ఇతర చట్టపరమైన ప్రక్రియలను రాబోయే 15 రోజుల్లో పూర్తి చేసి అర్హులైన అభ్యర్థులకు ఉత్తర్వులు అందజేయాలని ఆదేశించినట్టు తెలిపారు. కార్మికుల పేర్ల మార్పులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న 136 నుంచి గరిష్ఠంగా 170 మంది సమస్యలను మానవీయ కోణంలో పరిశీలించి పరిష్కరించాలని అధికారులకు సూచించామని, ఇందుకోసం ఏర్పాటు చేసిన సింగరేణి అధికారుల కమిటీ సిఫార్సుల ఆధారంగా తగిన నిర్ణయాలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మెడికల్ ఇన్వాలిడేషన్ కోసం కార్మికులు కొత్తగూడెం వరకు వెళ్లాల్సిన అవసరం లేకుండా సింగరేణి పరిధిలోని అన్ని ఏరియా ఆసుపత్రుల్లో ప్రతి నెలా నిర్ణీత రోజున మెడికల్ బోర్డు సమావేశాలు నిర్వహించాలని ఆదేశించామన్నారు. ఆయా ఆసుపత్రుల్లోనే వైద్య పరీక్షలు నిర్వహించి, వీలైనంత ఎక్కువ మంది కార్మికులకు ప్రయోజనం కలిగేలా మెడికల్ ఇన్వాలిడేషన్ ప్రక్రియను వేగవంతం చేస్తామన్నారు. కరోనా సమయంలో లేదా ఇతర స్థానిక కారణాలతో విధులకు హాజరుకాక ఉద్యోగాలు కోల్పోయిన కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు వన్‌టైమ్ ఆప్షన్ కింద తిరిగి విధుల్లోకి తీసుకునే అంశంపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్మికుల కుటుంబాల జీవనోపాధిని దృష్టిలో ఉంచుకుని మానవీయంగా వ్యవహరించాలన్నదే మా ప్రభుత్వ ఉద్దేశమని వివరించారు. సింగరేణి కార్మికులకు ప్రతి ఆరు నెలలకు ఒకసారి సేఫ్టీ కిట్స్ తప్పనిసరిగా పంపిణీ చేయాలని, కార్మికుల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావుండకూడదన్నారు. సింగరేణి ఉద్యోగులకు చెల్లిస్తున్న విధంగానే కార్మికుల పెర్క్స్ , అలవెన్స్‌లపై ఆదాయపన్నును కూడా సంస్థ తరఫున ప్రభుత్వానికి చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్టు వెల్లడించారు.

?“సింగరేణి అధికారులు, జిల్లా కలెక్టర్‌తో కూడిన కమిటీ ఆక్రమిత నివాస ప్రాంతాల్లో నివసిస్తున్న వారి ప్రాథమిక జాబితాను సిద్ధం చేస్తుంది. స్థానిక ఎమ్మెల్యేలతో సంప్రదించి, వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని అర్హులైన లబ్ధిదారుల సమగ్ర జాబితాను రూపొందిస్తాం. ఈ ప్రక్రియను నెల రోజుల్లోపు పూర్తి చేయాలని ఆదేశించాం. సింగరేణి పరిధిలోని ఏరియా ఆసుపత్రులను కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా తీర్చిదిద్దుతాం. సామాన్య కార్మికుడు కూడా ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లాల్సిన అవసరం లేకుండా సింగరేణి ఆసుపత్రుల్లోనే అత్యుత్తమ వైద్య సేవలు అందుబాటులోకి తీసుకొస్తాం. అవసరమైతే వైద్యుల వేతనాలు, పారితోషికాలను పెంచి నిపుణులైన వైద్యులను నియమిస్తాం. అత్యవసర వైద్యం కోసం కార్డియాక్, క్యాథ్ ల్యాబ్ సేవలను అందుబాటులోకి తీసుకొస్తామని” వెల్లడించారు. బొగ్గు గనులు, ఓవర్‌బర్డెన్ డంప్‌ల దుమ్ము వల్ల ప్రజల ఆరోగ్యంపై ప్రభావం పడుతున్న అంశాన్ని దృష్టిలో ఉంచుకొని సింగరేణి పరిధిలోని పాత జిల్లాల్లో ప్రతి గ్రామానికి వెళ్లి ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామన్నరు. కార్మికులతోపాటు వారి కుటుంబాలు, స్థానిక ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన చర్యలు తీసుకుంటాం. అధికారులకు పర్ఫార్మెన్స్ రిలేటెడ్ పే (పీఆర్పీ)ను చెల్లించేలా యాజమాన్యాన్ని ఆదేశించారు. ?సింగరేణి పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లు, ఆసుపత్రులు, ఇతర ప్రభుత్వ భవనాలపై సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేసి సౌర విద్యుత్ వినియోగాన్ని పెంచాలని, ఖరీదైన పట్టణ, వాణిజ్య భూములను సోలార్ ప్లాంట్లకు వినియోగించకుండా, పట్టణాలకు వెలుపల ఉన్న నిరుపయోగ భూములు, ఓవర్‌బర్డెన్ గుట్టలను ఇందుకు ఉపయోగించుకోవాలని సూచించారు. మరోవైపు ఇప్పటికే ఉన్న బొగ్గు బ్లాక్‌లలో కొన్ని మూతపడుతుండటంతో ఉత్పత్తి, ఆదాయంపై ప్రభావం పడుతోందన్నారు. దాదాపు 14 బ్లాక్‌లు మూతపడిన నేపథ్యంలో వాటి స్థానంలో కొత్త బ్లాక్‌లను సమకూర్చుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. కొత్త బ్లాక్‌ల సాధనకు ప్రజా ప్రభుత్వం చర్యలు సింగరేణి సంస్థను బలోపేతం చేసేందుకు తమ ప్రభుత్వం కొత్త బొగ్గు బ్లాక్‌ల సాధనపై దృష్టి సారించిందని భట్టి విక్రమార్క తెలిపారు. గత ప్రభుత్వం దిగిపోయిన తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం కొత్త బ్లాక్‌లను సాధించేందుకు చర్యలు చేపట్టిందన్నారు. తాడిచెర్ల-2, కోయగూడెం బ్లాక్ -3, మణుగూరు పీకే ఓసీ-2 డిప్ సైడ్ బ్లాక్, నైని వంటి బ్లాక్‌లను ప్రస్తావిస్తూ, కొత్త బ్లాక్‌ల సాధనతో పాటు సంస్థ వ్యాపారాన్ని విస్తరించేందుకు కృషి చేస్తున్నట్లు వివరించారు.ఏ మైనింగ్ సంస్థ అయినా నిరంతరం కొత్త బ్లాక్‌లను సాధిస్తూ వ్యాపారాన్ని విస్తరించుకుంటేనే దాని ఆర్థిక స్థితి మెరుగుపడుతుందని పేర్కొన్నారు. సింగరేణి కార్మికుల భవిష్యత్తు, సంస్థ మనుగడ, బొగ్గు ఉత్పత్తి సామర్థ్యం పెంపు దృష్ట్యా ఈ చర్యలు అత్యంత కీలకమని స్పష్టం చేశారు. మార్కెట్‌కు అనుగుణంగా బొగ్గు ధరల సర్దుబాటు ?ప్రస్తుతం బొగ్గు మార్కెట్‌లో తీవ్రమైన పోటీ నెలకొందని ఉప ముఖ్యమంత్రి చెప్పారు. మహానది, కోల్ ఇండియా, వెస్టన్ కోల్‌ఫీల్డ్స్ వంటి సంస్థల నుంచి బొగ్గు సరఫరా అవుతోందని, ప్రైవేటు సంస్థలు కూడా తక్కువ ధరలకు బొగ్గును అందిస్తున్నాయని వివరించారు. సింగరేణి బొగ్గు ధరలు అధికంగా ఉండటంతో కొన్ని సంస్థలు ఇతర వనరుల నుంచి బొగ్గు కొనుగోలు చేసేందుకు మొగ్గుచూపుతున్నాయని తెలిపారు. ఈ పరిస్థితుల్లో మార్కెట్ ధరలకు అనుగుణంగా సింగరేణి బొగ్గు ధరలను హేతుబద్ధీకరించాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. ధరలను సర్దుబాటు చేయకపోతే బొగ్గు కొనుగోలుదారులను కోల్పోయే ప్రమాదం ఉందని, తద్వారా సంస్థ ఆదాయం మరింత తగ్గే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. సింగరేణి ఆర్థిక ప్రయోజనాలను కాపాడుతూనే మార్కెట్‌లో పోటీతత్వాన్ని పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వెల్లడించారు. కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం సింగరేణి సంస్థను కాపాడటంతోపాటు కార్మికులు, వారి కుటుంబాల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని మంత్రి తెలిపారు. కార్మికుల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని చెప్పారు. మారుపేర్ల సమస్య పరిష్కారానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీసుకున్న సానుకూల నిర్ణయాన్ని తాను స్వాగతిస్తున్నట్లు పేర్కొన్నారు. సింగరేణిలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించిందని తెలిపారు. డిస్మిస్డ్ ఉద్యోగుల సమస్యలతోపాటు కార్మికులకు సంబంధించిన పలు సంక్షేమ అంశాలపై నిర్ణయాలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. శాశ్వత ఉద్యోగులతోపాటు కాంట్రాక్టు కార్మికుల ప్రయోజనాలను పరిరక్షించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ?సింగరేణి పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలతోపాటు పరిసర ప్రాంతాల్లోని ప్రభుత్వ విద్యాసంస్థలను ఆధునికీకరించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోందని శ్రీధర్‌బాబు చెప్పారు. యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో నైపుణ్య కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నిరుద్యోగ యువతీ యువకులకు అవసరమైన శిక్షణ అందించి ఉపాధి అవకాశాలను మెరుగుపరచాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను స్వాగతించాల్సింది పోయి, వాటిని అడ్డుకునే ప్రయత్నం చేయడం సరికాదని బీఆర్ఎస్ నాయకులకు హితవు పలికారు. సింగరేణి అభివృద్ధి, కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని చెప్పారు. ఈ సమావేశంలో కోల్ బెల్ట్ ఎమ్మెల్యేలు ప్రేం సాగర్ రావు, మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, కోరం కనకయ్య, మట్టా రాగమయి, పాయం వెంకటేశ్వర్లు, మాలోతు రాందాస్ నాయక్, గండ్ర సత్యనారాయణ రావు, విజయరామారావు, ఇంధన శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ నవీన్ మిట్టర్, సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. సింగరేణి కార్మికుల సంక్షేమం, లాభాల వాటాను ప్రకటించడం పట్ల ఎమ్మెల్యేలు డిప్యుటి సిఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబులను శాలువా కప్పి సత్కరించారు.

విద్యతోనే సమాజాభివృద్ధి

సైతం నిరూపించాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్యా పరిస్థితుల సర్వేలోనూ విద్యకు ఉన్న ప్రాధాన్యం స్పష్టమైందన్నారు. వెనుకబడిన వర్గాలు, ఆర్థికంగా బలహీనంగా ఉన్న కుటుంబాలు అభివృద్ధి సాధించడానికి విద్య కీలకమైన మార్గమని సర్వే గణాంకాలు వెల్లడిస్తున్నాయని వివరించారు. ఈ నేపథ్యంలో తెలంగాణ సమాజాన్ని ప్రపంచంతో పోటీపడే స్థాయికి తీసుకెళ్లేందుకు ప్రభుత్వం విద్యారంగంపై ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విద్యాశాఖను తన వద్దే ఉంచుకొని, విద్యారంగ అభివృద్ధి కార్యక్రమాలను ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. ఉపాధ్యాయ నియామకాలు.. విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యం విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు డీఎస్సీ ద్వారా పెద్దఎత్తున ఉపాధ్యాయ నియామకాలు చేపట్టామని, జూనియర్ కళాశాలల్లో జూనియర్ లెక్చరర్ల నియామకాలను కూడా పూర్తి చేశామని భట్టి విక్రమార్క తెలిపారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో మెరుగైన విద్యాబోధన అందించడంతోపాటు విద్యార్థుల సంక్షేమానికి అనేక చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలోని గురుకుల, రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు డైట్ ఛార్జీలను 40 శాతం, కాస్మెటిక్ ఛార్జీలను 200 శాతం పెంచినట్లు వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న సుమారు 27 లక్షల మంది విద్యార్థులకు ఉదయం అల్పాహారం అందించే కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. దీనికి అదనంగా వారానికి మూడు రోజులు పాలు లేదా రాగిజావ అందించే కార్యక్రమాన్ని కూడా విస్తరిస్తున్నామని చెప్పారు. 105 యంగ్ ఇండియా రెసిడెన్షియల్ పాఠశాలలు// అంతర్జాతీయ ప్రమాణాలతో, ఆంగ్ల మాధ్యమంలో విద్య అందించేందుకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 105 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను మంజూరు చేసి, నిర్మాణ పనులను వేగవంతం చేసినట్లు ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ఒక్కో పాఠశాలలో 2,000 నుంచి 2,500 మంది విద్యార్థులు చదువుకునేలా ప్రణాళిక రూపొందించామని చెప్పారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు క్రీడలు, మైదానాలు, ఇతర పాఠ్యేతర కార్యక్రమాలకు అవసరమైన సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. ఉపాధ్యాయులకు సైతం పాఠశాలల ప్రాంగణాల్లో నివాస సదుపాయాలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంతోపాటు ప్రతి నియోజకవర్గానికి ఒక తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను మంజూరు చేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వం ప్రాథమిక విద్యకే పరిమితం కాకుండా ఉన్నత విద్యారంగ అభివృద్ధిపైనా దృష్టి సారించిందని భట్టి విక్రమార్క తెలిపారు. విశ్వవిద్యాలయాల్లో అవసరమైన నియామకాలు చేపడుతున్నామని చెప్పారు. మహిళా విద్యకు ప్రోత్సాహం అందించేందుకు మహిళా విశ్వవిద్యాలయానికి వీరనారి చాకలి ఐలమ్మ పేరు పెట్టి, ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తున్నామని వివరించారు.మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా సాంకేతిక విద్యలోనూ సంస్కరణలు చేపడుతున్నామని తెలిపారు. ఐటీఐ కళాశాలలను ఆధునికీకరించడంతోపాటు పాలిటెక్నిక్ విద్యను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. ఆధునిక యంత్రాలు, కంప్యూటరైజ్డ్ సాంకేతిక పరిజ్ఞానంపై యువతకు నైపుణ్య శిక్షణ అందించి, ఉద్యోగాలకు అవసరమైన సామర్థ్యాలను పెంపొందించేందుకు ప్రతి నియోజకవర్గంలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. ఉపాధ్యాయుల భాగస్వామ్యంతోనే లక్ష్య సాధన విద్యారంగంలో ప్రభుత్వం చేపడుతున్న సంస్కరణలు భవిష్యత్తులో గేమ్ ఛేంజర్‌గా మారుతాయని భట్టి విక్రమార్క విశ్వాసం వ్యక్తం చేశారు. విద్య ద్వారా తెలంగాణ సమాజం రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా బలోపేతమై ప్రపంచంతో పోటీపడే స్థాయికి చేరుకుంటుందని అన్నారు. ‘గురు వందనం’ కార్యక్రమంలో అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులతో పాటు రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులందరూ ప్రభుత్వ లక్ష్యాల సాధనలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పిల్లల భవిష్యత్తే రాష్ట్ర భవిష్యత్తు అని పేర్కొంటూ, 2047 నాటికి తెలంగాణ ఆర్థిక వ్యవస్థను 3 ట్రిలియన్ డాలర్ల స్థాయికి తీసుకెళ్లాలన్న లక్ష్య సాధనలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కె కేశవ రావు, పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్, శాసనసభ్యులు తన్నీరు హరీష్ రావు జీ న్యూస్ సిఈఓ మరియు ఎడిటర్ భరత్ తదితరులు పాల్గొన్నారు.

రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు, 2027 ముప్పు

ప్రకృతి ప్రకోపించినప్పుడు ఏ ప్రభుత్వమైనా, ఎంతటి బలమైన వ్యవస్థ అయినా ఒక్కసారిగా కుదేలవుతుంది. అందులోనూ ఎల్ నినో వంటి వాతావరణ విపత్తులు పాలకులకు నిద్రలేకుండా చేసే అత్యంత క్లిష్టమైన సవాళ్లు. భూగోళం వేడెక్కడం వల్ల ఏర్పడే ఈ అనూహ్య వాతావరణ మార్పులు నేరుగా దేశ ఆర్థిక వ్యవస్థను, వ్యవసాయ రంగాలను ఛిన్నాభిన్నం చేస్తాయి. నీరు అనేది లేకపోతే మానవ జీవనమే మూగబోతుంది. తాగునీరు కరవైతే జనజీవనం అస్తవ్యస్తమవుతుంది, సాగునీరు అందకపోతే అన్నదాత కన్నీరుమున్నీరవుతాడు. ఇటు తాగు, సాగు నీటి కొరత ఏర్పడితే జల విద్యుత్ ఉత్పత్తి పూర్తిగా పడిపోయి కరెంట్ కోతలు మొదలవుతాయి. తద్వారా పారిశ్రామిక ఉత్పాదకత దెబ్బతిని, నిత్యావసరాల ధరలు చుక్కలను తాకుతాయి. ఇదొక దుర్భిక్షపు విషవలయం.ప్రస్తుతం దేశాన్ని, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలను కమ్ముకువస్తున్న ముప్పు కేవలం సాధారణ ఎల్ నినో కాదు. అంతకంటే ఎన్నో రెట్లు భీకరమైన సూపర్ ఎల్ నినో . రుతుపవనాలు చేతులెత్తేయడంతో ఈసార వర్షపాతం అంతంతమాత్రంగానే నమోదైంది. జలాశయాలు సగం కూడా నిండని దుస్థితిలో, ప్రస్తుతం అందుబాటులో ఉన్న కొద్దిపాటి నీటిని వచ్చే ఏడాది జూన్ వరకు తీవ్రమైన పొదుపుతో, అత్యంత అప్రమత్తంగా వాడుకోవాల్సిన కత్తిమీద సాములాంటి పరిస్థితి ఏర్పడింది. జలాశయాల్లో నీటి మట్టాలు అడుగంటిపోతున్న ఈ తరుణంలో పాలకులకు ఇది మునుపెన్నడూ లేని విధంగా అగ్నిపరీక్షగా మారింది.ఈ కరవు పరిస్థితుల కారణంగా రాబోయే రోజుల్లో ప్రజల్లో తీవ్రమైన అసహనం, ఆగ్రహం వ్యక్తమవడం సహజం. తాగునీరు అందక, విద్యుత్ కోట్లు పెరిగి, పంటలు ఎండిపోతున్న సమయాల్లో సగటు జీవి అగ్గిమీద గుగ్గిలమౌతాడు. ఈ సహజమైన ప్రజా అసహనాన్ని, నిరాశను పాలకులపై తిరుగుబాటుగా మలచడానికి, రాజకీయ లబ్ధి పొందడానికి ప్రతిపక్షాలు ఎప్పుడూ కాచుకుని కూర్చుంటాయి. ప్రభుత్వంపై బురదజల్లేందుకు, ప్రజలను రెచ్చగొట్టేందుకు ఇదే అదనుగా భావిస్తాయి. అయితే, రాజకీయ ప్రత్యర్థుల విమర్శలను ఎదుర్కొంటూ కేవలం పోలీసు బలంతోనో, ప్రకటనలతోనో ఈ విపత్తును నియంత్రించడం ఏ ప్రభుత్వానికైనా సాధ్యం కాదు.మరి ఈ పెనుముప్పు నుంచి గట్టెక్కాలంటే ప్రభుత్వాలు చేయాల్సింది ఏమిటి? ముందుగా పారదర్శకతతో కూడిన వాస్తవాలను ప్రజల ముందుంచాలి. ఉన్న నీటి వనరులు, విద్యుత్ లభ్యతపై ప్రతి పౌరుడికి ముందస్తు అవగాహన కల్పించాలి. నీటిని, కరెంటును ఏ విధంగా పొదుపుగా వాడుకోవాలో వివరిస్తూ ఒక ప్రజా ఉద్యమంలాంటి ప్రచారాన్ని చేపట్టాలి. ఈ సూపర్ ఎల్ నినో విపత్తును కేవలం ప్రభుత్వ సమస్యగా కాకుండా, ఇది మనందరి ఉమ్మడి సంక్షోభం అనే భావనను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి. ప్రతి గృహం, ప్రతి రైతన్న, ప్రతి పారిశ్రామికవేత్త నీటి పొదుపులో భాగస్వామ్యులుగా మారేలా విప్లవాత్మకమైన మార్గదర్శకాలను అమలు చేయాలి.ప్రజలను ఈ విపత్తు నిర్వహణలో భాగస్వామ్యం చేసినప్పుడే ప్రభుత్వాలపై భారం తప్పుతుంది, కాస్త రిలీఫ్ దొరుకుతుంది.పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన శక్తివంతమైన ఎల్ నినో ప్రభావం, విపరీతంగా వేడెక్కుతున్న సముద్రాలు రాబోయే కాలంలో ప్రపంచ వాతావరణాన్ని తీవ్రంగా ప్రభావితం చేయనున్నాయి. ప్రపంచ వాతావరణ సంస్థ హెచ్చరికల ప్రకారం, ఈ సహజ వాతావరణ దృగ్విషయం డిసెంబర్‌లో శిఖరాగ్రానికి చేరుకుని 2027 ఫిబ్రవరి వరకు కొనసాగే అవకాశం ఉంది.

రాజకీయాల కన్నా ప్రజా సంతృప్తి కీలకం

హైదరాబాద్ : తెలంగాణ రాజకీయ తెరపై ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి వేస్తున్న ఎత్తులు, పైఎత్తులు ప్రత్యర్థులకు నిద్రలేకుండా చేస్తున్నాయి. రాజకీయ వ్యూహాల్లోనూ, మైండ్ గేమ్‌లోనూ తనదైన దూకుడు ప్రదర్శిస్తున్న రేవంత్.. పాలన విషయానికి వచ్చేసరికి మాత్రం అదే స్థాయిలో సక్సెస్ కాలేకపోతున్నారనే విమర్శలు క్షేత్రస్థాయి నుంచి గట్టిగా వినపడుతున్నాయి. ప్రభుత్వ మార్పుతో సరికొత్త సంచలనాలు వస్తాయని ఆశించిన సామాన్య ప్రజలు.. కనీసం గతంలో అందిన సంక్షేమ పథకాలైనా సక్రమంగా అందుతాయా లేదా అనే సందేహంలో పడిపోయారు.గత బీఆర్ఎస్ హయాంలో అమలులో ఉండి, ప్రజల దైనందిన జీవితంలో భాగమైన కొన్ని పథకాలు రేవంత్ రెడ్డి పాలనలో మందగించడం, అసలు అమలు కాకపోవడం ప్రధాన విమర్శలకు దారితీస్తోంది. కొత్తగా ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీలు అమల్లో సాంకేతిక, ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్న సమయంలో, పాత పథకాల పంపిణీలో సైతం ఆలస్యం జరగడం ప్రజల్లో అసంతృప్తిని పెంచుతోంది. ముఖ్యంగా రైతు సంక్షేమం విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర విమర్శలు ఎదుర్కొంటోంది. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎలాంటి నిబంధనలు లేకుండా లభించిన రైతు బీమా పథకాలు.. కాంగ్రెస్ తెచ్చిన రైతు భరోసా పేరు మార్పుతో పాటు ఆంక్షలు పెట్టారనే ఆరోపణలు ఉన్నాయి. సాగులో లేని భూములు, గుట్టలకు పెట్టుబడి సాయం కట్ చేస్తామని ప్రకటించినప్పటికీ, అసలైన రైతులకు వానాకాలం, యాసంగి పెట్టుబడి సహాయం అందించడంలో విపరీతమైన ఆలస్యం జరుగుతోందని ప్రతిపక్షాలు , రైతు సంఘాలు మండిపడుతున్నాయి.పేద కుటుంబాల్లో పెళ్లిళ్లకు కొండంత అండగా నిలిచే కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్’ పథకాల పరిస్థితి కూడా దయనీయంగా మారింది. దరఖాస్తులు చేసుకుని నెలలు గడుస్తున్నా లబ్ధిదారులకు చెక్కులు అందడం లేదని, రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది అప్లికేషన్లు పెండింగ్‌లో పడిపోయాయని విమర్శలు వస్తున్నాయి. ప్రభుత్వం తులం బంగారం ఇస్తామని ఎన్నికల వేళ హామీ ఇచ్చినప్పటికీ, పాత ఆర్థిక సహాయం రూ. 1,00,116 అందించడంలోనే నత్తనడక నడవడం ఆర్థిక లోటును తేటతెల్లం చేస్తోంది. రాష్ట్రంలో నెలకొన్న తీవ్ర ఆర్థిక లోటు, భారీ రుణభారం కారణంగానే సంక్షేమ పథకాలకు సకాలంలో నిధులు విడుదల చేయలేకపోతున్నామని పాలకపక్షం సమర్థించుకుంటున్నప్పటికీ.. ప్రజలకు మాత్రం లబ్ధి వేగంగా అందడం లేదనేది వాస్తవం. బీఆర్ఎస్ హయాంలో లోపాలున్నప్పటికీ పథకాలు నిరంతరాయంగా అందేవని, కానీ ఇప్పుడు నిధుల కొరత సాకుగా చూపి ఆలస్యం చేస్తున్నారనే భావన పల్లెల్లో వ్యక్తమవుతోంది. రాజకీయంగా ప్రత్యర్థులను కార్నర్ చేయడంలోనూ, పట్టు నిలుపుకోవడంలోనూ నిరంతరం బిజీగా ఉంటున్న రేవంత్ రెడ్డి.. గ్రౌండ్ లెవెల్ అడ్మినిస్ట్రేషన్‌పై అదేస్థాయి దృష్టి పెట్టలేకపోతున్నారనేది ఎక్కువ మంది అభిప్రాయం. ప్రతిపక్షాలపై విమర్శలతో సమయం గడపడం కంటే, ప్రజలకు నిత్యావసరాలుగా మారిన సంక్షేమ పథకాలను నిరంతరాయంగా అందిస్తేనే ప్రభుత్వానికి నిజమైన దూకుడు ఇమేజ్ లభిస్తుందని అంటున్నారు.

వెట్టిచాకిరీ నిర్మూలనపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్) : వెట్టిచాకిరీ నిర్మూలన, నివారణపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో వెట్టిచాకిరీ నిర్మూలనపై అవగాహన కల్పించేందుకు రూపొందించిన స్వేచ్ఛా రథాన్ని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం వెట్టిచాకిరీ నిర్మూలనకు సంబంధించిన అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, వెట్టిచాకిరీ నిర్మూలన, నివారణపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, బాధితులకు సకాలంలో ప్రభుత్వ సహాయం అందేలా చర్యలు తీసుకోవడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. వెట్టిచాకిరీకి సంబంధించిన ఘటనలు ఎక్కడైనా గుర్తించినప్పుడు సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. వెట్టిచాకిరీ ఘటనల సమాచారం కోసం టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్: వెట్టిచాకిరీకి సంబంధించిన ఘటనలను తెలియజేయడానికి, బాధితులకు సకాలంలో ప్రభుత్వ సహాయం అందేలా జోక్యం కోరడానికి టోల్‌ఫ్రీ బాండెడ్ లేబర్ హెల్ప్‌లైన్ 080-69434343 అందుబాటులో ఉందని తెలిపారు. వెట్టిచాకిరీ బాధితులు, ఈ తరహా ఘటనల గురించి తెలిసిన వారు హెల్ప్‌లైన్‌ను వినియోగించుకోవాలని సూచించారు. స్వేచ్ఛా రథం ద్వారా ప్రజలకు వెట్టిచాకిరీ వల్ల కలిగే అనర్థాలు, దాని నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ కార్యక్రమంలో భాగస్వాములై వెట్టిచాకిరీ నిర్మూలనకు సహకరించాలని కోరారు. వెట్టిచాకిరీ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలి... ప్రతి ఒక్కరూ గౌరవప్రదంగా, స్వేచ్ఛగా, ఎలాంటి దోపిడీకి గురికాకుండా పనిచేసే పరిస్థితులు కల్పించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. వెట్టిచాకిరీని పూర్తిగా నిర్మూలించేందుకు ప్రభుత్వ శాఖలు, ప్రజలు సమన్వయంతో పనిచేయాలని, బాధితులకు అండగా నిలుస్తూ వెట్టిచాకిరీ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో సంబంధిత అధికారులు , తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం.

మహేశ్వరం విద్యుత్ అధికారి ఏఈ చక్రపాణి.

మహేశ్వరం అక్టోబరు 13 (ది క్రైమ్ న్యూస్), :విద్యుత్ లైన్ ల మరమ్మతుల కారణంగా నేడు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని మహేశ్వరం విద్యుత్ అధికారి ఏఈ చక్రపాణి ఒక ప్రకటనలో తెలిపారు. నేడు (బుధవారం) ఉదయం పది గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు కావూరి హిల్స్ ప్రజాయ్ విల్లాస్, ఇమామ్ గూడ, శ్రీశైలం జాతీయ రహదారి ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని అన్నారు. కావున విద్యుత్ వినియోగదారులు. విద్యుత్ సంస్థ సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

అర్హులైన ఏ ఒక్క లబ్ధిదారుడు పెన్షన్‌కు దూరం కాకుండా చూడాలి.

మున్సిపల్ చైర్పసన్ నాగలక్ష్మి

ధర్మపురి, అక్టోబర్ 13, (ది క్రైమ్ న్యూస్) : అర్హులైన ఏ ఒక్క లబ్ధిదారుడు పెన్షన్‌కు దూరం కాకుండా చూడాలని పట్టణ మున్సిపల్ చైర్పసన్ వేముల నాగలక్ష్మి అన్నారు. మంగళవారం చేయూత పెన్షన్ దరఖాస్తుల వెరిఫికేషన్‌లో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన చేయూత పెన్షన్ పథకంలో భాగంగా దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల అర్హత నిర్ధారణ కోసం ధర్మపురి పట్టణంలో దరఖాస్తుల పరిశీలన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి (సీఈఓ) బి. గౌతమ్ రెడ్డి హాజరై లబ్ధిదారుల దరఖాస్తులను పరిశీలించారు. అనంతరం మీడియా తో మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికీ చేయూత పెన్షన్ అందించాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తుల వెరిఫికేషన్ ప్రక్రియను చేపట్టిందన్నారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించి, అర్హులైన ఏ ఒక్క లబ్ధిదారుడూ పెన్షన్‌కు దూరం కాకుండా చూసే బాధ్యత సంబంధిత అధికారులదేనని కోరారు.

మన జిల్లా - మన రామగిరి ఖిల్లా ట్రెక్కింగ్‌లో

ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

అక్టోబర్ 18 ఉదయం 6 గంటలకు బేగంపేట గ్రామం నుంచి ట్రెక్కింగ్ ప్రారంభం

ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ చారిత్రక వారసత్వాన్ని తెలుసుకునే అవకాశం మన జిల్లా -- మన రామగిరి ఖిల్లా కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్

పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్) : జిల్లాలోని చారిత్రక వారసత్వ సంపద రామగిరి ఖిల్లా ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేయడంతో పాటు, ప్రకృతి అందాలను ఆస్వాదించడం, అటవీ పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు నిర్వహిస్తున్న 'మన జిల్లా -- మన రామగిరి ఖిల్లా' వాకింగ్, ట్రెక్కింగ్ కార్యక్రమంలో ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సూచించారు. మంగళవారం పెద్దపల్లిలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష 'మన జిల్లా -- మన రామగిరి ఖిల్లా' వాకింగ్, ట్రెక్కింగ్ కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ అక్టోబర్ 18వ తేదీ ఆదివారం ఉదయం 6 గంటలకు బేగంపేట గ్రామం నుంచి ట్రెక్కింగ్ ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేవారు రామగిరి ఖిల్లాను సందర్శించి, అక్కడి ప్రకృతి అందాలను ఆస్వాదించడంతో పాటు చారిత్రక వారసత్వ విశేషాలను తెలుసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆసక్తిగల వారు పోస్టర్‌పై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తమ పేర్లను నమోదు చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు. ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ చారిత్రక ప్రదేశాల ప్రాధాన్యతను తెలుసుకునేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని తెలిపారు. ట్రెక్కింగ్ సమయంలో అటవీ ప్రాంతంలోని చెట్లు, మొక్కలు, ఇతర వృక్షసంపదకు ఎలాంటి నష్టం కలిగించకుండా ప్రకృతిని పరిరక్షించాలని నిర్వాహకులు కోరారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ బాధ్యతతో వ్యవహరిస్తూ అటవీ సంపదను కాపాడేందుకు సహకరించాలని సూచించారు. రామగిరి ఖిల్లా వంటి చారిత్రక ప్రదేశాల ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేయడంతో పాటు, వాటి పరిరక్షణపై అవగాహన పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని నిర్వాహకులు తెలిపారు. ప్రకృతిని ఆస్వాదిస్తూ చారిత్రక వారసత్వాన్ని కాపాడుకోవడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏజే పెడల్స్ సైకిల్స్‌కు చెందిన అఖిల్ రెడ్డి, లెంకల మహిపాల్ రెడ్డి (మాజీ సైనికుడు, అంతర్జాతీయ పర్వతారోహకుడు), పెద్దపల్లి యువశక్తి సోషల్ మీడియా ప్రతినిధి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

దేవి నవరాత్రోత్సవాల్లో భాగంగా చంద్రఘంట రూపములో భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు.

ధర్మపురి, అక్టోబర్ 13, (ది క్రైమ్ న్యూస్) : జగిత్యాల జిల్లా ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి దేవస్థానములో దసరా నవరాత్రోత్సవములలో" భాగంగా 3వ రోజు ప్రధాన దేవాలయముతో పాటు ఇతర అనుబంధ ఆలయాలలో కలశస్థాపనలు, విశ్వక్సేన పూజలు, దీపారాధనలు మొదలగు కార్యక్రమములు వైభవంగా నిర్వహించారు. ముఖ్యంగా అనుబంధ దేవాలయమైన శ్రీ రామలింగేశ్వరస్వామి వారి ఆలయము (శివాలయము) లో దసరా (దేవీ) నవరాత్రుల ఉత్సవములలో భాగంగా 3వ రోజు ఉదయము వేదపండితులు, ఋచీకులచే మహా సంకల్పము, పుణ్యకలశ, గణపతి పూజ, స్వస్తిపుణ్యాహ వచనము, ఋచ్చిక వర్ణనము, అఖండ దీప స్థాపన, నవగ్రహ, వాస్తు, క్షేత్ర పాలక, యోగిని, అంకురారోపణ, మాతృక, సర్వతోభద్ర మండల పూజలతో ప్రధాన కలశ స్థాపనలు జరిగినవని పేర్కొన్నారు. ఇందులో భాగంగా సప్తశతీ పారాయణము, అమ్మ వారికి చతుష్షష్టి పూజ, శ్రీచక్రమునకు కుంకుమార్చన, హారతి, మంత్రపుష్పము, తీర్థప్రసాద వితరణలు జరిగినట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఐదు ఋచ్చికులచే చండీపారాయణం, దేవీభాగవత పారాయణం, కన్యకా, సువాసిని పూజలు నిర్వహించినట్లు తెలిపారు. అమ్మ వారు చంద్రఘంట రూపములో గులాబి రంగు చీరలో మల్లెపూలు, బిల్వపత్ర దండలు ధరించి భక్తులకు దర్శనం ఇచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమములో దేవస్థాన మాజీ దేవస్థాన అధ్యక్షులు జక్కు రవీందర్, వేదపండితులు బొజ్జ రమేష్ శర్మ, పాలేపు ప్రవీణ్ శర్మ, ఓంకార్ శర్మ, ఋచ్చికులు తాడూరి బలరాం శర్మ, అలువాల కృష్ణ శర్మ, భరత్ శర్మ, ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, సూపరింటెండెంట్ ఎ. శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ వి. తిరుపతి, అర్చకులు నేరెళ్ల విజయ్, సముద్రాల వంశీ, చక్రపాణి కిరణ్ కుమార్, అభిషేక పురోహితులు బొజ్జ రాజగోపాల్ శర్మ మరియు అర్చకులు సిబ్బంది, ఋచ్చికులు పాలేపు సందీప్ శర్మ, మరియు ఇతర ప్రముఖులు, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పోలీస్ వాహనాల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

వాహనాల పనితీరును స్వయంగా పరిశీలించిన సీపీ

గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్) : పోలీస్ వాహనాల పనితీరు, నిర్వహణపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని, ఈ విషయంలో నిర్లక్ష్యం వహించవద్దని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశించారు. మంగళవారం కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జోన్ల పోలీస్ స్టేషన్లకు చెందిన వాహనాలను కమిషనరేట్ కార్యాలయంలో స్వయంగా తనిఖీ చేసి వాటి కండిషన్‌ను పరిశీలించారు. వాహనాలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా, అత్యవసర సమయాల్లో వెంటనే వినియోగించుకునే విధంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. నిర్వహణలో నిర్లక్ష్యం కారణంగా ప్రజలకు అందించే పోలీస్ సేవలకు ఎలాంటి అంతరాయం కలగకూడదని స్పష్టం చేశారు. ప్రతి డ్రైవర్ తనకు కేటాయించిన వాహనంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ మంచి కండిషన్‌లో ఉంచాలని తెలిపారు. వాహనాల సర్వీసింగ్‌తో పాటు టైర్లు, బ్రేకులు, లైట్లు, ఇంజిన్ తదితర ముఖ్యమైన భాగాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని ఆదేశించారు. వాహనాలను పూర్తి స్థాయిలో మంచి కండిషన్‌లో ఉంచే డ్రైవర్లను గుర్తించి రివార్డులు అందజేయాలని అధికారులకు సూచించారు. ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించడంలో వాహనాల నిర్వహణ కీలకమని, అధికారులు, సిబ్బంది దీనిని బాధ్యతగా తీసుకుని విధులు నిర్వహించాలని కమిషనర్ పేర్కొన్నారు.

ఘనంగా మాజీ స్పీకర్ జన్మదిన వేడుకలు...

పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూ.స్) : తెలంగాణ తొలి శాసనసభ స్పీకర్, శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి భవిష్యత్ లో మరింత ఉన్నత శిఖరాలకు ఎదగాలని తెలంగాణ ఉద్యమకారుడు పోసాని శ్రీనివాస్ యాదవ్ ఆకాంక్షించారు. మధుసూదన చారి జన్మదిన వేడుకలు మంగళవారం పెద్దపల్లి స్ఫూర్తి దివ్యాంగుల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ మధుసూదన చారి ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎండీ జహంగీర్, శ్రీనివాస్, అన్వేష్, షరీఫ్, మంచు రామస్వామి, నర్సయ్య, రిషి, జబీర్, తదితరులు పాల్గొన్నారు.

ఐలమ్మ విగ్రహా ధ్వంసం దోషులను కఠినంగా శిక్షించాలి : దీటి రాజు

బెజ్జంకి, అక్టోబర్ 13(ది క్రైమ్ న్యూస్) : మెదక్ ఆటోనగర్ లో జరిగిన చాకలి ఐలమ్మ విగ్రహా ధ్వంసాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు సిద్దిపేట జిల్లా రజక సంఘ వర్కింగ్ ప్రెసిడెంట్ దీటి రాజు ఒక ప్రకటనలో తెలిపారు. భూస్వామ్య పెత్తందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా పేదల హక్కుల కోసం పోరాడి సమాజానికి ఎంతో ఆదర్శంగా నిలిచిన వీరనారి ఐలమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేయడం హేయమైన చర్యని ఘటనకు పాల్పడిన దుండగులను వెంటనే గుర్తించి చట్టప్రకారం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం తగిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. దెబ్బతిన్న విగ్రహాన్ని పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టి విగ్రహానికి రక్షణ కల్పించాలని సంభందిత అధికారులకు విజ్ఞప్తి చేశారు. కేవలం రజక సమాజానికే కాక అణగారిన వర్గాల ఆత్మగౌరవానికి, మహిళా చైతన్యానికి, సామాజిక న్యాయ పోరాటానికి ఐలమ్మ ప్రతీకని ఆమె విగ్రహాన్ని ధ్వంసం చేయడం ద్వారా ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయాలని చూస్తే రజక సమాజం సహించబోదని స్పష్టం చేస్తూ రజకులు ఐక్యంగా ఉండి ఐలమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దోషులకు చట్టపరంగా శిక్ష పడేలా పోలీసులకు సహకరించాలని దీటి రాజు ప్రకటన ద్వారా కోరారు.

ఆల్ఫోర్స్ లో ఘనంగా బతుకమ్మ సంబరాలు

ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి

సుల్తానాబాద్ అక్టోబర్ 13(ది క్రైమ్ న్యూస్).. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు, ఆడపడుచులకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుక గొప్పదని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్ రెడ్డి అన్నారు. సుల్తానాబాద్ పట్టణంలోని ఆల్ఫోర్స్ పాఠశాలలో మంగళవారం బతుకమ్మ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రకృతిని ఆరాధిస్తూ పూలను పూజిస్తూ జరుపుకునే బతుకమ్మ పండుగ మన సాంప్రదాయాలకు ప్రతిబింబమని అన్నారు. పలు రకాల పూలతో బతుకమ్మలను పేర్చి వాటి చుట్టూ తిరుగుతూ పాటలు పాడుతూ ఆడుకునే ఆనందంగా జరుపుకునే ఈ పండగ తెలంగాణ ప్రజల జీవనశైలిలో ప్రత్యేక స్థానాన్ని కలిగి ఉందన్నారు. సామాజిక ఐక్యతను చాటిచెప్పే గొప్పతనం బతుకమ్మ పండుగ అన్నారు. విద్యార్థులకు విద్యాబోధన తో పాటు భారతీయ సంస్కృతి తెలంగాణ సాంప్రదాయాల పట్ల అవగాహన కల్పించడంలో ఆల్ఫోర్స్ విద్యాసంస్థలు ఎల్లప్పుడూ ముందుంటాయన్నారు, అందులో భాగంగానే ముందస్తుగా పాఠశాలలో బతుకమ్మ వేడుకలను నిర్వహిస్తున్నామన్నారు నూతన వస్త్రాలు ధరించిన విద్యార్థులు తల్లిదండ్రులు ఉపాధ్యాయులు పాటలకు అనుగుణంగా నృత్యాలు చేస్తూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తో పాటు అధ్యాపక బృందం విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వృత్తి విద్యతో ఉపాధి అవకాశాలు

దూలపల్లి పాఠశాల విద్యార్థుల పారిశ్రామిక యాత్ర

కుత్బుల్లాపూర్ దూలపల్లి, (ది క్రైమ్ న్యూస్) అక్టోబరు 13: వృత్తి విద్యతో ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. దూలపల్లి పీఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులు మంగళవారం పారిశ్రామిక, వృత్తి విద్యా అధ్యయన యాత్రలో పాల్గొన్నారు. బ్యూటీ అండ్ వెల్‌నెస్, ఐటీ అండ్ ఐటీఈఎస్ విభాగాలకు చెందిన సుమారు 80 మంది విద్యార్థులు ఉపాధ్యాయులతో కలిసి యాదాద్రి భువనగిరి జిల్లా జలాల్‌పూర్‌లోని స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థను సందర్శించారు. ఈ సందర్భంగా కంప్యూటర్ ప్రయోగశాలలు, హార్డ్‌వేర్ విభాగాలు, బ్యూటీ అండ్ వెల్‌నెస్ శిక్షణా కేంద్రాలను పరిశీలించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, వృత్తి నైపుణ్యాలు, స్వయం ఉపాధి మార్గాలు, ఉద్యోగ అవకాశాలపై సంస్థ ప్రతినిధులు అవగాహన కల్పించారు. పాఠ్యాంశాలను ప్రత్యక్షంగా పరిశీలించడం ద్వారా విద్యార్థులకు వృత్తి విద్యపై స్పష్టత లభించింది. అంతకుముందు విద్యార్థులు సంఘీ ఆలయాన్ని దర్శించుకున్నారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. సాయంత్రం 6 గంటలకు క్షేమంగా పాఠశాలకు చేరుకున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కె. వేణుగోపాల్, ఉపాధ్యాయులు కవిత, మానేశ్వరి, వృత్తి విద్యా శిక్షకులు సింధూజ, హరిత, ఇతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సంపాదకీయం

న్యాయస్థానాలపైనే ‘చెత్త’ పలుకులా?

ఏ ఎండకా గొడుగు పట్టడంలో సిద్ధహస్తుడనని ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఎండీ వేమూరి రాధాకృష్ణ (ఆర్కే) మరోసారి రుజువు చేసుకున్నారు. చేతిలో ఒక పత్రిక, టీవీ చానెల్ ఉండటంతో తననొక రాజ్యాంగేతర శక్తిగా భావించుకుంటూ.. తన వర్గానికి అనుకూలమైన పరిణామాలైతే ఒకలాగా, గిట్టనివారి విషయంలో చాలా తేడాగా వండి వార్చడం ఆర్కేకు పరిపాటిగా మారింది. తన పత్రిక, టీవీ చానెళ్ళలో ప్రతీ వారం రాసే కొ(చె)త్తపలుకును నిశితంగా గమనిస్తే ఆర్కే అసలు స్వరూపం ఇట్టే బట్టబయలవుతుంది. తాజాగా హైదరాబాదు హెచ్.సి.యూలో 400 ఎకరాల భూ వివాదానికి సంబంధించిన కేసులో తెలంగాణ సీఎస్ తీరుపై సుప్రీంకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. గచ్చిబౌలి భూముల విషయంలో తమ ఆదేశాలను బేఖాతరు చేస్తే, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జైలుకు వెళ్లడానికి సిద్ధంగా ఉండాలని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు గట్టి వార్నింగ్ ఇచ్చారు. ఈ పరిణామంతో రేవంత్ సర్కార్ పూర్తిగా ఆత్మరక్షణలో పడింది. సుప్రీం తీర్పుతో తదుపరి ఏమి చేయాలో అర్థం గాక సీఎం రేవంత్ అయోమయంలో పడ్డారు. సుప్రీం న్యాయమూర్తులు విచారణలో భాగంగా చేసిన వ్యాఖ్యలపై సీఎం రేవంత్ ఎలా ఫీలయ్యారో తెలియదు కానీ, సీఎంకు స్వయంప్రకటిత రాజగురువుగా ఫీలయ్యే ఆంధ్రజ్యోతి ఆర్కే మాత్రం బాగా హర్ట్ అయ్యారు. ఎంతగా అంటే.. సర్వోన్నత న్యాయస్థానం తీర్పుపై బహిరంగంగా అక్కసు వెళ్లగక్కేటంతగా. ఆర్కేను న్యాయమూర్తుల కామెంట్స్ అంతగా డిస్టర్బ్ చేసినట్లున్నాయి. ఈ వ్యాఖ్యలను ఉటంకిస్తూ ఆదివారం నాటి (ఏప్రిల్ 06, 2025) ఆర్కే కొత్తపలుకులో చేసిన వ్యాఖ్యలు ఆయనలోని నిస్పృహకు పరాకాష్టగా కనిపిస్తున్నాయి. ‘కేసుల విచారణ సందర్భంగా న్యాయమూర్తులు చట్టాలను మాత్రమే సమీక్షించాలా? లేదా వ్యక్తిగత అభిప్రాయాలను కూడా జోడించవచ్చా? అన్నదానిపై కూడా న్యాయ నిపుణులలో కొంతకాలంగా చర్చ జరుగుతోంది. కేసుల విచారణ సందర్భంగా న్యాయమూర్తులు చేస్తున్న వ్యాఖ్యలు తుది తీర్పు లేదా ఆదేశాలలో భాగం కావడం లేదు. అయినప్పటికీ, మీడియాలో వాటికి విశేష ప్రచారం లభిస్తుండటంతో సామాన్య ప్రజానీకం ప్రభావితం అవుతున్నారు. సదరు వ్యాఖ్యలను తీర్పులలో భాగంగానే చూస్తున్నారు. ఈ పరిణామం న్యాయ వ్యవస్థ విశిష్టతకు నష్టం చేస్తుందన్న అభిప్రాయం బలంగా ఉంది’ ఇవీ తాజాగా ఆర్కే తన కాలమ్‌లో పలికిన చెత్త పలుకులు. ఈ సందర్భంగా ఇదే ఆర్కే తన ఆంధ్రజ్యోతి పత్రికలోనూ, ఏబీఎన్ ఛానల్‌లోనూ గతంలో జగన్ ప్రభుత్వంపై ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు చేసిన వ్యాఖ్యలపై పెద్దపెద్ద హెడ్డింగులు పెట్టి, వార్తలు రాసిన విషయాన్ని ఒకసారి గుర్తుచేసుకోవాలి. అమరావతి నుంచి రాజధానిని మార్చాలనుకోవడం మతిలేని చర్య అంటూ గతంలో హైకోర్టు న్యాయమూర్తి చేసిన వ్యాఖ్యలను ఆంధ్రజ్యోతి బాగా హైలైట్ చేసింది. ఈ ఒక్క కేసులోనే కాకుండా పలు సందర్భాలలో జగన్ ప్రభుత్వాన్ని తప్పుబడుతూ హైకోర్టు న్యాయమూర్తులు చేసిన కామెంట్స్‌ను ఉటంకిస్తూ, ఆంధ్రజ్యోతిలో 3 మొట్టికాయలు, 6 తలంట్లు అనే హెడ్డింగ్ పెట్టి.. పెద్ద కథనాన్ని రాయించి రాధాకృష్ణ తెగ సంబరపడి పోయారు. ఆ రోజు ఆర్కేకు న్యాయమూర్తుల కామెంట్స్ భగవద్గీతలా వినిపించాయి. ఇప్పుడు రేవంత్ సర్కారును తప్పుబడితే మాత్రం అవి అనుచిత, అసందర్భ వ్యాఖ్యలన్నమాట. ఆర్కే జర్నలిజాన్ని చూస్తే.. ఊసరవెల్లి కూడా సిగ్గుపడుతుందేమో. ఈ చెత్త పలుకులో మరో విడ్డూరమైన వాదన ఏమిటంటే.. జగన్ సీఎంగా ఉన్నప్పుడు తన నివాసం కోసం రుషికొండను తొలిచేసి, పర్యావరణ నిబంధనలను కాలరాసినపుడు సుప్రీంకోర్టు దానిపై ఓ కమిటీని నియమించి వదిలేసిందని, హెచ్.సి.యూ భూముల కేసులో మాత్రం తెలంగాణ చీఫ్ సెక్రటరీకి ఎందుకు వార్నింగ్ ఇచ్చిందో అర్థం కావడం లేదని రాధాకృష్ణ మథనపడుతున్నారు. అంటే సుప్రీంకోర్టు న్యాయమూర్తులు విచారణ సందర్భంగా ఎలాంటి వ్యాఖ్యలు చేయాలో ఆర్కేని అడిగి, నేర్చుకోవాలన్నమాట. ఇలాగే వదిలేస్తే, రాధాకృష్ణ తన చెత్త పలుకుల ముసుగులో సుప్రీంకోర్టు తీర్పులు ఎలా ఉండాలో కూడా చెబుతారేమో. గతంలో ఓ సందర్భంలో మీడియా నియంత్రణపై హైకోర్టు న్యాయమూర్తి వ్యాఖ్యలు చేసినప్పుడు ఆంధ్రజ్యోతి కథనం ద్వారా ఆర్కే తీవ్రంగా స్పందించారు. రాజ్యాంగంలోని ప్రతీ వ్యవస్థ తన పరిధిని, లక్ష్మణ రేఖను దాటకపోవడం శ్రేయస్కరమని ఆ కథనంలో రాధాకృష్ణ కర్తవ్యబోధ చేశారు. మరి అదే లాజిక్ ఇప్పుడు ఆర్కేకి కూడా వర్తిస్తుంది కదా! అయినా గతంలో జడ్జీలు ఎందుకు ఇలాంటి ఆదేశాలిచ్చారు.. ఇప్పుడు వారి ఉత్తర్వులు మరోలా ఎందుకు ఉన్నాయంటూ న్యాయ వ్యవస్థను ప్రశ్నించే అధికారం ఆర్కేకు ఎవరిచ్చారు? కింది కోర్టు నుంచి పైకోర్టుకు అప్పీలుకు వెళ్ళినప్పుడు గానీ, జడ్జిలు మరే కారణం వల్లగానీ సందర్భాన్ని బట్టి న్యాయమూర్తుల ఉత్తర్వులలో మార్పు ఉండవచ్చు. అంతమాత్రం చేత తనకు అనుకూలమైన రేవంత్ రెడ్డి వంటి వ్యక్తులకు ప్రతికూలమైన ఆదేశాలిస్తే.. వెంటనే సుప్రీంకోర్టు న్యాయమూర్తుల నిబద్ధతపై అనుమానాలు సృష్టించే రీతిలో రాధాకృష్ణ చెత్తపలుకులు’ వండి వార్చడం ఏమిటి? ఇది ఆయనకు అలవాటైనట్టు కనిపిస్తున్నది. (కొ)చెత్త పలుకులో రాసిన ఓ లైన్‌లో ‘తా ను చేస్తే శృంగారం%ా% ఎదుటివారు చేస్తే వ్యభిచారం అనేవిధంగా తెలంగాణలో ప్రతిపక్షాల వైఖరి ఉంద’ని ఆర్కే తన ఆక్రోశాన్ని వెళ్లగక్కారు. తాజాగా రాధాకృష్ణ విశ్లేషణను చదివితే, ఆయన రాస్తున్న తీరు శృంగారమా లేక రేవంత్ సర్కారు తప్పు చేస్తున్నా, అడ్డగోలుగా సమర్థించడాన్ని వ్యభిచారం కింద పరిగణించాలో స్పష్టత ఇవ్వాల్సిన బాధ్యత ఆర్కేదే.

రాహుల్ మౌనానికి కారణాలు?

తెలంగాణ పరిణామాలు, ఘటనల పట్ల కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్‌గాంధీ స్పందించాలనే మాటలు వేర్వేరు వైపుల నుంచి కొన్ని నెలలుగా వినవస్తున్నాయి. కానీ ఆయన నుంచి ఎటువంటి కదలికలు కన్పించటం లేదు. అందుకు కారణాలు ఏమై ఉంటాయని ఆలోచించగా ప్రధానమైనవి మూడు కనిపిస్తున్నాయి. ఒకటి, తమకు ఇక్కడ కావలసింది అధికారమే తప్ప ప్రజల బాగోగులు కాదు. రెండు, ఏ జోక్యం చేసుకున్నా పార్టీలో బలమైన వర్గాలు చెదిరిపోయి తమ పార్టీ ప్రభుత్వానికి ముప్పు రాగలదేమోననే భయం. మూడు, మౌలికమైన స్థాయిలో తన అసమర్థత. ఇటువంటివి లేనట్లయితే ఆయన జోక్యం చేసుకొని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, తన పరిపాలనను చక్కదిద్దేందుకు ఎప్పుడో పూనుకోవలసింది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 16 నెలలు గడిచింది. ఒకవైపు పరిపాలన అస్తవ్యస్తంగా మారుతూ ప్రజల్లో అసంతృప్తి తలెత్తటం, మరొకవైపు ముఖ్యమంత్రి వ్యక్తిగత వ్యవహరణపై విమర్శలు రావటం నాలుగైదు నెలలు గడిచేసరికి కనిపించసాగాయి. ప్రతిపక్షాలను పక్కన ఉంచుదాం. కేవలం వాటిని విస్మరించినట్లయితే రాహుల్‌గాంధీని అంతగా అనవలసింది ఉండదు. ప్రతిపక్షాలు ఎప్పుడూ అంతే లెమ్మని తోసివేసే వీలు ఆయనకు ఉంటుంది. కాని జరుగుతూ వచ్చింది అది కాదు. వాస్తవానికి ప్రతిపక్షాలు వెంటనే విమర్శలు చేసినట్టయితే, కొత్త ప్రభుత్వాన్ని కాస్త కుదురుకోనివ్వరా అనే మాట ప్రజల నుంచి రాగలదు గనుకనే అవి తగినంతకాలం చెదురుమదురుగా తప్ప విమర్శలు చేయలేదు. ప్రజలకు కూడా అది ఇంకా వేచి చూసే దశగానే గడిచింది. ఆ కాలమంతా ఎవరూ రాహుల్‌గాంధీ ఎక్కడనే ప్రశ్నలు వేయలేదు కూడా. ఆ తర్వాత పరిస్థితి మారటం మొదలైంది. రేవంత్ రెడ్డి మాటల తీరు సరేసరి కాగా, అంతకన్న ముందుగా ప్రజలు మాట్లాడటం మొదలైంది కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలుకాకపోవటం గురించి. అవి వారి నిత్య జీవిత సమస్యలు గనుక. వాటిని నమ్మినందువల్లనే కాంగ్రెస్‌కు ఓటు వేశారు గనుక. హామీలు సాధారణమైనవి కావు. వాటిని ఎప్పుడూ ఏ పార్టీ చేయనివిధంగా బాండ్ పేపర్లపై సంతకాలు చేసి ఇంటింటికి తిరిగి పంచారు. ఆ ప్రకటనలు స్థానిక నాయకులు గాక సాక్షాత్తూ నెహ్రూ-గాంధీ వంశానికి చెందిన సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకా గాంధీలు తెలంగాణలో పర్యటించి సభలలో పాల్గొంటూ డిక్లరేషన్ల రూపంలో, మ్యానిఫెస్టో రూపంలో, బాండ్ల రూపంలో చేశారు. హామీల అమలుకు నిర్దిష్టమైన గడువులు విధించారు. వాటి అమలు బాధ్యత స్వయంగా తమదన్నారు. ఆ విషయంలో తాము ఢిల్లీలో తెలంగాణ ప్రజల ప్రతినిధుల వలె వ్యవహరించగలమన్నారు. అది, ప్రజలకు ఇన్నిన్ని నమ్మబలికిన రాహుల్‌గాంధీ, ఈ విషయాలపై ప్రజల నుంచి నిరంతరం ఫిర్యాదులు, విమర్శలు వస్తున్నా, ఇటువైపు ఒక్కటంటే ఒక్కసారైనా మొహం చూపకపోవటం. వాస్తవానికి ప్రజలతో నమ్మబలికింది మొత్తం కుటుంబం కలిసికట్టుగా అయినందున వారంతా ఇటురావటం ప్రజల పట్ల రాజకీయ బాధ్యతే గాక నైతిక బాధ్యత కూడా. కనీసం రాహుల్‌గాంధీ అయినా ఆ పని చేయాలి. ఒక్కసారి కాదు, తరచుగా. అయినప్పటికీ ఒక్కసారైనా ఆ పని చేయలేదు. ఇక్కడ హామీలు అమలు కాకపోవటం విషయంలోనే కాదు. మూసీ జేసీబీలు, గిరిజనుల భూముల ఆక్రమణలు, వారిపై అర్ధరాత్రి దాడులు, రైతుల ఆత్మహత్యలు, నిరుద్యోగుల ఆందోళనల నుంచి మొదలుకొని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో వందలాది ఎకరాల అర్ధరాత్రి విధ్వంసం, వన్యప్రాణులపై హింస వరకు తరచు చోటుచేసుకుంటూ వస్తున్న అనేక సందర్భాల్లో కూడా రాహుల్ ఎక్కడ అనే ప్రశ్నలు వినరావటం ఎక్కువవుతున్నది. ఈ మాట మొదట ప్రతిపక్షాల నుంచి రాగా, తర్వాత వివిధ ప్రజా వర్గాల నుంచి అంతకుమించి వస్తున్నది. అయినప్పటికీ రాహుల్‌గాంధీ ఇటు రాకపోవటం సరి కదా, కనీసం ఢిల్లీ నుంచి ఒకమాటైనా పల్లెత్తి అనటం లేదు. ప్రజలు మంచివారు, అల్ప సంతోషులు. రాహుల్ ఇక్కడకు రావటం వల్ల సమస్యలు తీరకపోయినా, తీరేటట్లు చూస్తానని మాట్లాడిపోతే నెమ్మదిస్తారు. అట్లా రానప్పుడు కనీసం రానైనా లేదని నొచ్చుకుంటారు. నిరసనభావం పెరుగుతుంది. ఆ నిరసన రాష్ట్ర నాయకత్వానికి పరిమితమయ్యే బదులు గాంధీ కుటుంబానికి విస్తరిస్తుంది. ఇప్పుడది జరుగుతున్నది. ఎన్నికల సమయంలో ఆ కుటుంబానికి చెందిన తల్లీ పిల్లలంతా వచ్చినప్పుడు ప్రజలకు ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ గుర్తుకువచ్చి కొంత మురిశారు కూడా. తర్వాత ప్రభుత్వం ఏర్పడి నెలలు గడిచే కొద్దీ ఆ మురిపెం, నమ్మకం నిరసనగా మారుతున్నాయి. రాష్ట్ర నాయకత్వంతో పాటు అధిష్ఠానం పట్ల కూడా నిరసన కలిగితే ఇక మిగిలేదేమున్నది. దీనంతటికీ రేవంత్ రెడ్డి అసభ్యకరమైన మాటలు తోడవుతున్నాయి. అందుగురించి నగరాల నుంచి గ్రామాల వరకు, ఉన్నతవర్గాల నుంచి సాధారణ ప్రజల దాకా ఆయనను విమర్శించనివారు కనిపించటం లేదు. ఈ విధంగా రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు, ముఖ్యమంత్రి వ్యక్తిగత లోటుపాట్లతో పాటు స్వయంగా తమపై వస్తున్న విమర్శల గురించి సోనియా, రాహుల్, ప్రియాంకలకు తెలియదా? అట్లా ఎంతమాత్రం అనుకోలేము. వారికి సమాచారాలు ఎప్పటికప్పుడు వేర్వేరు మార్గాలలో తెలుస్తూనే ఉంటాయి. పైగా రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల పర్యవేక్షణకు ఒకరిని ఏఐసీసీ నుంచి ప్రత్యేకంగా నియమిస్తారన్నది తెలిసిందే. కర్ణాటకలోనూ ఇవే భయాలు, వదంతులు ఉన్నందునే గాంధీ కుటుంబం అక్కడ ఎన్నెన్ని జరుగుతున్నా అటుపోవడం లేదు, పరిస్థితులను చక్కబెట్టడం లేదు. మూడు, దేశమంతటా ఎప్పటినుంచో ప్రసిద్ధి చెందిన రాహుల్ గాంధీ అసమర్థత. 2004లో ప్రత్యక్ష రాజకీయాలలోకి వచ్చిన ఆయన, అంత గొప్ప సుదీర్ఘ నేపథ్యం గల కుటుంబం నుంచి వచ్చి కూడా, ఈ 21 సంవత్సరాల కాలంలో కుటుంబ నేపథ్యాన్ని బట్టి హోదాలు అనుభవించటం మినహా తన శక్తి సామర్థ్యాలను ఎప్పుడూ నిరూపించుకోలేదు. అందుకే ఒక దశలో తనను తప్పించి ప్రియాంకను ముందుకు తేవాలనే ఆలోచనలు ఆ పార్టీలోనే సాగాయి. ప్రియాంక సామర్థ్యం మాత్రం ఏమిటన్నది వేరే చర్చ. కానీ, రాహుల్ గురించి అటువంటి అభిప్రాయం ఏర్పడటమన్నది గమనించవలసిన విషయం. ఏవైనా కలసివచ్చినప్పుడో, ఇతర పార్టీలతో పొత్తు కారణంగానో ఆయన సాధించిన విజయాలే అన్నీ. ఆ వివరాలలోకి ప్రస్తుతం వెళ్లనక్కరలేదు గాని, విషయమేమంటే, తనకెవరో ఇచ్చిన ‘పప్పూ’ బిరుదు పూర్తిగా అర్థవంతమైనదే. ఈ విధమైన కారణాలు రాహుల్‌గాంధీని బలంగా నిలువరిస్తున్నప్పుడు, ఆయన తెలంగాణ ప్రజలకు ఎందువల్ల మొహం చూపటం లేదన్న సందేహానికి బహుశా ఆస్కారమే లేదు. తను అటువంటి సాహసం చేస్తేనే ఆశ్చర్యపోవలసి వస్తుంది. నెహ్రూ-గాంధీ వంశంలో ఆయన ఐదవతరం నాయకుడు. ఆ మొత్తం వంశ చరిత్రను ఎవరైనా రాసినట్లయితే, అందరిలోకి అతి బలహీనునిగా, అత్యంత అసమర్థునిగా తన పేరు నమోదవుతుంది. కేవలం పాదయాత్రలు, లోక్‌సభ డ్రామాలు ఎవరినీ సమర్థులుగా చేయవు. కనుక తెలంగాణ ప్రజలు ఆయనవైపు చూడటమన్నదే వృథా ప్రయాస.

బీజేపీలో చేరిన భారత మాజీ క్రికెటర్..

భారత మాజీ క్రికెటర్ కేదార్ జాదవ్ రాజకీయ రంగ ప్రవేశం చేశారు. మహారాష్ట్ర కు చెందిన ఆయన బీజేపీ తీర్థం పుచ్చుకున్నారు. మహారాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు చంద్రశేఖర్ బవాంకులే సమక్షంలో జాదవ్ కాషాయం కండువా కప్పుకున్నారు. ముంబై లోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. కేదార్ జాదవ్ అంతర్జాతీయ క్రికెట్ కెరీర్ ఎక్కువ కాలం కొనసాగలేదు. అతను దేశం తరపున 73 వన్డే మ్యాచ్‌లు మాత్రమే ఆడాడు. రెండు సెంచరీలు, ఆరు అర్ధసెంచరీలతో మొత్తం 1389 పరుగులు చేశాడు. జాదవ్ తన వన్డే కెరీర్‌లో 52 ఇన్నింగ్స్‌లలో 141 ఫోర్లు, 24 సిక్సర్లు బాదాడు. 2014 నవంబర్ 16న శ్రీలంకతో జరిగిన వన్డే మ్యాచ్‌లో అరంగేట్రం చేశాడు. తొలి మ్యాచ్‌లో జాదవ్ 24 బంతుల్లో మూడు ఫోర్లతో 20 పరుగులు చేశాడు. కేదార్ జాదవ్ ఐపీఎల్‌లో కూడా 95 మ్యాచ్‌లు ఆడాడు. మొత్తం 81 ఇన్నింగ్స్‌లో నాలుగు అర్ధ సెంచరీల కొట్టాడు. మొత్తం 1208 పరుగులు చేశాడు. అందులో జాదవ్ బెస్ట్ స్కోర్ 69 పరుగులు. జాదవ్ ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్, చెన్నై సూపర్ కింగ్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్లకు ప్రాతినిధ్యం వహించాడు.

ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు.. అత్యవసరంగా ల్యాండింగ్

విమానాల్లో బాంబులు పెట్టామంటూ గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్‌లు, ఈ మెయిల్‌లు, లేఖల ద్వారా బెదిరించడం అనేది ఇప్పుడు నిత్యకృత్యంగా మారిపోయింది. తాజాగా రాజస్థాన్ రాజధాని జైపూర్ నుంచి మహారాష్ట్ర రాజధాని ముంబై కి వెళ్తున్న ఇండిగో విమానానికి కూడా అలాంటి బాంబు బెదిరింపు అనుభవమే ఎదురైంది. జైపూర్ నుంచి ముంబైకి బయలుదేరిన 6%జు% 5324 నెంబర్ ఇండిగో విమానం టాయిలెట్స్‌లో లభ్యమైన ఓ లేఖ తీవ్ర కలకలం రేపింది. విమానంలో బాంబుపెట్టామని ఆ లేఖలో రాసి ఉంది. అయితే విమానం అప్పటికే ముంబైకి సమీపించడంతో ఛత్రపతి శివాజీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో అత్యవసరంగా ల్యాండ్ చేశారు. ఆ విమానంలోని 225 మంది ప్రయాణికులను సురక్షితంగా కిందికి దించారు.

విశ్వాసం గొప్పదనం

‘గురువే పరమ ధర్మం. గురువే పరాగతి%ా% ఎవరికి దేవుడిపై, గురువుపై సమానమైన భక్తి ఉంటుందో అతను పరబ్రహ్మను పొందగలడు’ అని పై శ్లోక భావం. దీనిని బలపరిచే కథ ఇది. ధ్వజదత్తుడు అనే బ్రాహ్మణుడు ఉండేవాడు. అతను దారిద్ర్యంతో బాధపడుతూ నైమిశారణ్యంలోని పుష్కర మహాముని దగ్గరికి వెళ్లి సాష్టాంగపడ్డాడు. ఆ బ్రాహ్మణుడికి ముని హనుమత్ మంత్రాన్ని ఉపదేశించాడు. ధ్వజదత్తుడు రాత్రింబవళ్లు ఆ మంత్రజపం చేశాడు. గురువుపై విశ్వాసం లేక మంత్రసిద్ధి కాలేదు. కొన్నాళ్లకు వ్యాధిపీడితుడైన గాలుడనే వేటగాడు ధ్వజదత్తుడిని కలుసుకున్నాడు. తన బాధలు ఆయనతో చెప్పుకొన్నాడు. అప్పుడు ధ్వజదత్తుడు ‘దైవం లేదు. మంత్రం లేదు. పుష్కరుడి నుంచి మాత్రం మంత్రం స్వీకరించకు’ అన్నాడు. గాలుడు ఉత్సుకతతో పుష్కర మహర్షి దగ్గరికి వెళ్లి పరిచర్య చేశాడు. అతనిపై సందేహంతో మహర్షి ధ్యానించగా హనుమంతుడు ప్రత్యక్షమయ్యాడు. ‘గురుభక్తి ఉంటే సరి. ఉపదేశించవచ్చు’ అని ఆజ్ఞ ఇచ్చాడు ఆంజనేయుడు. మంత్రోపదేశానికి ముందు గాలుడిని పుణ్యతీర్థంలో స్నానం చేసి రమ్మన్నాడు పుష్కర ముని. అప్పుడు గాలుడు ‘మీ పాద జలమే పుణ్యతీర్థం’ అన్నాడు. గురువు హనుమంతుడిని ధ్యానించి తన పాదజలాన్ని అతనిపై చల్లి ద్వాదశాక్షర మంత్రోపదేశం చేశాడు. గురు సమీపంలోనే గాలుడు 108 సార్లు జపం చేయగానే సిద్ధి లభించింది. భూత భవిష్యత్తులను దర్శించగలిగాడు. గాలుడు ఇంటికి వెళుతూ ధ్వజదత్తుడిని చూశాడు. కానీ, అతను గురునింద చేస్తాడన్న భయంతో మరోదారి ఎంచుకున్నాడు. అది గమనించిన ధ్వజదత్తుడు గాలుడికి అడ్డువచ్చి, అతనిలో అపూర్వ తేజస్సు చూసి అబ్బురపడ్డాడు. వెంటనే పుష్కరుడి దగ్గరికి వెళ్లి ‘గాలుడికి ఎలా సిద్ధి కలిగింది? నాకు ఎందుకు కాలేదు?’ అని నిలదీశాడు. అప్పుడు పుష్కరుడు ‘నీకు దైవంపైనే గాని గురువుపట్ల నమ్మకం లేనందుకు’ అన్నాడు. ధ్వజదత్తుడు పశ్చాత్తాపంతో పుణ్య నదీ తీరానికి వెళ్లి గురువు, దైవంపై సమాన విశ్వాసాన్ని దృఢతరం చేసి 108 సార్లు జపం చేయగానే అతనికి సిద్ధి కలిగింది.



ఆధ్యాత్మికం

సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ

రామగుండం పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం

ఎన్టీపీసీ ఉద్యోగులు, అధికారులకు సైబర్ భద్రతపై సూచనలు

గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్) : సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ సూచించారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో ఎన్టీపీసీ ఉద్యోగులు, అధికారులకు సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, సామాజిక మాధ్యమాల వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పెద్దపల్లి జోన్, రామగుండం సర్కిల్, ఎన్టీపీసీ పోలీసులు, రామగుండం సైబర్ క్రైమ్ పోలీసులు, సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఉ హెడ్ ఆఫ్ ప్రాజెక్ట్ ఫియాజ్ టైయబ్, పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎన్టీపీసీ సంస్థకు, స్థానిక పోలీసులకు మధ్య గత 40--50 సంవత్సరాలుగా కొనసాగుతున్న సత్సంబంధాలను మరింత బలోపేతం చేసుకుంటూ పరస్పర సహకారంతో ముందుకు సాగాలని అన్నారు. ప్రతిష్ఠాత్మక సంస్థలో కార్యక్రమాల నిర్వహణకు ముందస్తు ప్రణాళిక, సమన్వయం అవసరమని తెలిపారు. ఆధునిక సాంకేతికతను వినియోగించుకుంటున్న సైబర్ నేరగాళ్లు ప్రత్యేక కేంద్రాల ద్వారా వ్యవస్థీకృతంగా మోసాలకు పాల్పడుతున్నారని హెచ్చరించారు. అధిక వేతనాలు, ఆకర్షణీయమైన ఉద్యోగాల పేరుతో యువతను ప్రలోభపెట్టి సైబర్ నేరాలకు పాల్పడేలా చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజల్లో సైబర్ భద్రతపై అవగాహన కల్పించడం పోలీసుల బాధ్యతని, యువ ఇంజనీర్లు తమ సాంకేతిక పరిజ్ఞానాన్ని, నైపుణ్యాలను సైబర్ నేరాల నివారణకు, సమాజ శ్రేయస్సుకు వినియోగించాలని పిలుపునిచ్చారు. అనుమానాస్పద సందేశాలు, లింకులు, ఫోన్ కాల్స్, డబ్బు బదిలీకి సంబంధించిన అభ్యర్థనలు వచ్చినప్పుడు తొందరపడి స్పందించకుండా "ఆగండి.. ఆలోచించండి.. నిర్ధారించుకోండి" అనే విధానాన్ని పాటించాలని సూచించారు. ప్రజల భయం, అత్యాశ, బలహీనతలు, అత్యుత్సాహాన్ని ఆసరాగా చేసుకుని నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని, ఇతరులు ఎదుర్కొన్న సైబర్ మోసాల నుంచి పాఠాలు నేర్చుకుని జాగ్రత్తగా వ్యవహరించాలని అన్నారు. కార్యక్రమంలో భాగంగా సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడే విధానాలను వివరించే వీడియోలను ప్రదర్శించి ఉద్యోగులు, అధికారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గోదావరిఖని ఏసీపీ ఎం. రమేష్, సీసీపీఎస్ ఏసీపీ రంగా రెడ్డి, రామగుండం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ కుమార్, ఎన్టీపీసీ ఎస్‌ఐ వెంకట్, ఎన్టీపీసీ అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ హయాంలోనే జిల్లా సమగ్ర అభివృద్ధి

- బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష

- ఘనంగా పెద్దపల్లి జిల్లా దశాబ్ది ఉత్సవాలు

పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్) : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా తెలంగాణలో కేసీఆర్ అభివృద్ధి ఆనవాళ్లను చెరిపివేయడం ఎవరి తరమూ కాదు. అని బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష పేర్కొన్నారు. పెద్దపల్లి జిల్లా ఏర్పాటై పదేళ్లు పూర్తయిన సందర్భంగా జిల్లా కేంద్రంలో భారత రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో మంగళవారం దశాబ్ది పండుగ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామి దేవాలయం చౌరస్తా వద్ద తెలంగాణ తల్లి విగ్రహానికి,అనంతరం అక్కడి నుంచి ర్యాలీగా చేరుకుని డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ బస్టాండ్ చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహానికి మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్,రామగుండం మాజీ ఎమ్మెల్యే,బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కోరుకంటి చందర్,పెద్దపల్లి మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ దాసరి మమతా రెడ్డి,పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి చిరుమల్ల రాకేష్ కుమార్,జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్ సింగ్,నాయకులు గంట రాములు యాదవ్‌లతో కలిసి బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష పూలమాలలు పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. పార్టీ అధినేత కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బస్టాండ్ కూడలిలో నిర్వహించిన సభలో దాసరి ఉష మాట్లాడుతూ కేసీఆర్ ముందుచూపుతో చేపట్టిన జిల్లాల పునర్వ్యవస్థీకరణ,అధికార వికేంద్రీకరణ వల్లే పరిపాలన ప్రజల ముంగిటకు వచ్చి,అట్టడుగు వర్గాలకు సంక్షేమ ఫలాలు అందాయని,మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ కృషితో కలెక్టరేట్,మెడికల్ కాలేజీ,ట్యాంక్ బండ్,మార్కెట్,గురుకులాల వంటి ఎన్నో అభివృద్ధి పనులు సాధ్యమయ్యాయని గుర్తుచేశారు. పెద్దపల్లి ఖ్యాతిని ప్రపంచ పటంలో నిలిపి లక్షలాది ఎకరాలను సస్యశ్యామలం చేసిన కాళేశ్వరం ప్రాజెక్టులో కేవలం రెండు పిల్లర్ల మరమ్మతులను కూడా పూర్తి చేయకుండా మూడేళ్లుగా సాగదీస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పొట్ట కొడుతోందని ధ్వజమెత్తారు. సుల్తాన్‌పూర్ గ్రామానికి చెందిన ఆర్చర్ తానిపర్తి చికిత ఆసియా క్రీడల్లో రెండు స్వర్ణాలు సాధించి 2028 ఒలింపిక్స్‌కు సిద్ధమవుతుంటే, ఖరీదైన పరికరాల కోసం ఆమె తండ్రి భూమిని తాకట్టు పెట్టి అప్పులపాలైనా ప్రస్తుత ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేస్తూ,ఆమెకు వెంటనే రూ.5 కోట్ల నజరానాతో పాటు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ ఒక చరిత్ర,తిరుగులేని శిఖరమని,1300 మంది అమరుల త్యాగాలను స్మరిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడి బీఆర్ఎస్‌ను తిరిగి అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు,పార్టీ ముఖ్య నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

జిల్లాలోని ప్రతి ఆహార వ్యాపారి తప్పనిసరిగా ఎఫ్ఎస్-ఎస్ఏఐ లైసెన్స్ లేదా నమోదు కలిగి ఉండాలని

కామారెడ్డి ఆహార భద్రతా అధికారి జి విక్రమ్

కామారెడ్డి జిల్లా ది క్రైమ్ న్యూస్ (ప్రతినిధి) : కామారెడ్డిసదాశివనగర్ మండలంలో ఆహార భద్రతా అధికారి ఆకస్మిక తనిఖీలు గడువు ముగిసిన ఆహార ఉత్పత్తుల తొలగింపు. నిబంధనలు పాటించని వ్యాపారులకు నోటీసులు కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలంలో ఆహార భద్రతా అధికారి జి. విక్రమ్ మంగళవారం పలు చిల్లర దుకాణాలు, రెస్టారెంట్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో కొన్ని దుకాణాల్లో గడువు ముగిసిన ఆహార ఉత్పత్తులను గుర్తించి, వాటిని వెంటనే తొలగించి పారవేయించారు. నాణ్యతపై అనుమానం ఉన్న పలు ఆహార పదార్థాల నమూనాలను సేకరించి, పరీక్షల నిమిత్తం ప్రయోగశాలకు పంపించారు. అలాగే, ఆహార భద్రతా ప్రమాణాల ప్రకారం అవసరమైన ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్ లేదా నమోదు లేకుండా వ్యాపారాలు నిర్వహిస్తున్న పలు సంస్థలను గుర్తించి, సంబంధిత నిర్వాహకులకు నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆహార భద్రతా అధికారి మాట్లాడుతూ, జిల్లాలోని ప్రతి ఆహార వ్యాపారి తప్పనిసరిగా ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్ లేదా నమోదు కలిగి ఉండాలని సూచించారు. ఆహార పదార్థాల నాణ్యత, పరిశుభ్రత విషయంలో నిర్లక్ష్యంఎ ఆహార భద్రతా శాఖ అధికారులకు ఫిర్యాదు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజల ప్రాణాలపై నిర్లక్ష్యంగా

వ్యవహరిస్తే సహించేది లేదు.

బీజేపీ పట్టణ అధ్యక్షులు గాజు భాస్కర్.

ధర్మపురి, అక్టోబర్ 13, (ది క్రైమ్ న్యూస్) : ధర్మపురి పట్టణంలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం బీజేపీ పట్టణ శాఖ అధ్యక్షులు గాజు భాస్కర్ ఆధ్వర్యంలో నాయకులు సందర్శించారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు, కనీస మౌలిక సదుపాయాలు, వైద్య సిబ్బంది పనితీరు, రక్త పరీక్షల నివేదికలు, మందుల లభ్యత తదితర అంశాలను వారు పరిశీలించడం జరిగిందని పేర్కొన్నారు. అనంతరం బిజెపి పట్టణ అధ్యక్షులు గాజు భాస్కర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి శ్రీనివాస్‌లు మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రికి పేదలు, మధ్యతరగతి కుటుంబాల ప్రజలు ఎంతో నమ్మకంతో వస్తారని అలాంటి వారికి నాణ్యమైన వైద్యం అందించడం ప్రభుత్వంతో పాటు వైద్య సిబ్బంది బాధ్యత అని పేర్కొన్నారు. కానీ ఆసుపత్రిలో కనీస సౌకర్యాలు, వైద్య సేవల నిర్వహణ, సిబ్బంది బాధ్యతాయుతమైన పనితీరు విషయంలో లోపాలు ఉన్నాయనీ వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా తాము ఈరోజు ఆస్పత్రిని సందర్శించడం జరిగిందని వివరించారు. ఆసుపత్రిలో ముఖ్యంగా రక్త పరీక్షల నివేదికల్లో తప్పులు ఉన్నాయనే ఫిర్యాదులు, మందుల లభ్యత, వైద్య సిబ్బంది నిర్లక్ష్యంపై వస్తున్న ఆరోపణలపై అధికారులు సమగ్ర విచారణ జరిపించాలని వారు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. వైద్య నివేదికల్లో పొరపాట్లు జరిగితే రోగులకు తప్పుడు చికిత్స అందే ప్రమాదం ఉందని వారు ఆవేదన వ్యక్తంచేశారు. ఇది చిన్న విషయం కాదని ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన అత్యంత కీలకమైన అంశం అని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి అంటే కేవలం భవనం కాదని, పేద ప్రజలకు భరోసా ఇచ్చే ప్రాణరక్షక కేంద్రం అని వైద్యం కోసం వచ్చే రోగులను నిర్లక్ష్యం చేయడం, విధుల్లో బాధ్యతారాహిత్యంగా వ్యవహరించినటువంటి వారిపై తగిన చర్యలు తీసుకోవాలని భారతీయ జనతా పార్టీ డిమాండ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసుపత్రిలో కనీస మౌలిక సదుపాయాలైన మెరుగుపరచాలని రక్త పరీక్షల నివేదికల నాణ్యత, ఖచ్చితత్వంపై సమగ్ర విచారణ చేపట్టాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని, అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా చూడాలని, రోగులకు సమయానికి వైద్య సేవలు అందేలా పర్యవేక్షణ ఉండాలని, ఆసుపత్రి పనితీరుపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు గాజు భాస్కర్, జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లి శ్రీనివాస్, పట్టణ ప్రధాన కార్యదర్శి తిరుమందాస్ సత్యనారాయణ, జిల్లా ఎండోమెంట్ కో కన్వీనర్ కలకోట రాజు, పట్టణ ఉపాధ్యక్షులు బాకీ అనిల్, సీనియర్ నాయకులు కాశెట్టి మహేష్, అప్పం శ్రీనివాస్, కార్యదర్శి ఠాగూర్ రాకేష్, బీజేవైఎం నాయకులు ఆనందాస్ నవీన్, కాసారపు వెంకటేష్, సోషల్ మీడియా ఇంచార్జ్ కాశెట్టి హరీష్ మరియు తదితరులు పాల్గొన్నారు.

నాచారం ఈఎస్ఐ ఆసుపత్రిలో నాలుగు నెలలుగా జీతాలు పెండింగ్

కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలి

ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. నరసింహ

మేడ్చల్, అక్టోబర్ 13(ది క్రైమ్ న్యూస్): నాచారం ఈఎస్ఐ ఆసుపత్రిలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య, భద్రతా సిబ్బందికి నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. నరసింహ డిమాండ్ చేశారు. వేతనాలు చెల్లించకపోవడాన్ని నిరసిస్తూ కార్మికులు మంగళవారం ఉదయం రెండు గంటలపాటు విధులు నిలిపివేసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహ మాట్లాడుతూ.. నాలుగు నెలలుగా జీతాలు అందక కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వేతనాల చెల్లింపు కోసం నెల రోజులుగా రెండుసార్లు ఆసుపత్రి అధికారులకు వినతిపత్రాలు అందించినా ఫలితం లేకపోవడంతో ఆందోళనకు దిగాల్సి వచ్చిందన్నారు. ఒకవైపు కాంట్రాక్టు కార్మికులకు ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు చెల్లిస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం చెబుతుండగా, మరోవైపు తెలంగాణలో బతుకమ్మ, దసరా వంటి ప్రధాన పండుగల సమయంలోనూ కార్మికులకు వేతనాలు అందకపోవడం బాధాకరమన్నారు. కార్మికులకు వైద్య సేవలు అందించే ఆసుపత్రిలో రోగులకు ఇబ్బందులు కలగకూడదనే ఉద్దేశంతో సమ్మెకు దిగడం లేదని, అయినప్పటికీ సమస్య పరిష్కారం కాకపోతే తప్పనిసరి పరిస్థితుల్లో సమ్మె చేపడతామని హెచ్చరించారు. సంబంధిత కాంట్రాక్టర్‌ను అడగగా.. గత పది నెలలుగా ప్రభుత్వం నుంచి బిల్లులు రావడం లేదని, అయినప్పటికీ ఆరు నెలల జీతాలు చెల్లించినట్లు తెలిపారని నరసింహ వివరించారు. కార్మికులకు సంబంధించిన బిల్లులను అధికారులు పది నెలలుగా మంజూరు చేయకపోవడంతో వారు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఆసుపత్రి అధికారులు రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులతో మాట్లాడి పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం కాకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ ధర్నాలో కాంట్రాక్టు కార్మికులు క్రాంతి, భాస్కరాచారి, నిరంకారీ, తులసి తదితరులు పాల్గొన్నారు.

గజలక్ష్మీ అలంకరణలో పద్మావతి అమ్మవారి దర్శనం

మేడ్చల్, అక్టోబరు 13(ది క్రైమ్ న్యూస్) : కుషాయిగూడలోని శ్రీ పద్మావతి వెంకటేశ్వర స్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు పద్మావతి అమ్మవారు గజలక్ష్మీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు కళాకోటి వెంకటరమణా చార్యులు, ఆరుట్ల నారాయణాచార్యులు, వేణుగోపాలాచార్యులు, బిట్కూరి లక్ష్మణాచార్యుల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని ఆదిలక్ష్మి రూపంలో దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. అష్టైశ్వర్యాలు, సుఖసంతోషాలు కలగాలని కోరుకుంటూ భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. శరన్నవరాత్రి ఉత్సవాలతో ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. అమ్మవారి దర్శనం చేసుకున్న భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు.

ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై బీజేపీ విస్తృత అవగాహన కార్యక్రమం

అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి: బీజేపీ నాయకుల పిలుపు

ది క్రైమ్ న్యూస్ । దేవరకొండ । అక్టోబర్ 13 : భారతీయ జనతా పార్టీ దేవరకొండ పట్టణ అధ్యక్షుడు వస్కుల సుధాకర్ ఆధ్వర్యంలో మంగళవారం దేవరకొండ పట్టణంలో ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అర్హులైన ఓటర్లకు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పిస్తూ, తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని న్యాయవాదులను కలిసి ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియపై వివరించారు. అర్హత కలిగిన న్యాయవాదులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులను కలిసి ఓటరు నమోదు ప్రాధాన్యతను వివరించి, అర్హులైన వారు నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా బీజేపీ దేవరకొండ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఓటరు నమోదు కన్వీనర్ నక్క వెంకటేష్ యాదవ్ మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరూ ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై అవగాహన పెంచుకోవాలని పిలుపునిచ్చారు. నిర్ణీత నిబంధనలు, ప్రక్రియ ప్రకారం తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు కీలకమని, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ హక్కును సద్వినియోగం చేసుకునేలా పార్టీ శ్రేణులు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులైన ఓటర్లు తమ హక్కును వినియోగించుకునేలా పట్టణంలోని వివిధ వర్గాల ప్రజలకు ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ దేవరకొండ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఓటరు నమోదు కో-కన్వీనర్ జల్దా భాస్కర్, బీజేపీ సీనియర్ నాయకులు బెజవాడ శేఖర్, వనం పుష్పలత, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి చిత్రం ఉదయ్ కుమార్, బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శులు చిలక రాజు బిక్కు, సముద్రాల సహదేవ్, గంజి హరి, ఇడం రవికుమార్, ఎర్ర బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో ఉత్తమ క్రీడా నైపుణ్యం ప్రదర్శించాలి

టీపీసీసీ అధికార ప్రతినిధి, అడహాక్ కమిటీ కన్వీనర్ డా. సత్యం శ్రీరంగం.

కూకట్ పల్లి అక్టోబర్ 13 (ది క్రైమ్ న్యూస్) : తెలంగాణ రాష్ట్ర త్రోబాల్ అసోసియేషన్ అడహాక్ కమిటీ ఆధ్వర్యంలో కోల్‌కతాలో 2026 అక్టోబర్ 31వ తేదీ నుండి నవంబర్ 1వ తేదీ వరకు నిర్వహించనున్న సబ్ జూనియర్ త్రోబాల్ టోర్నమెంట్‌లో తెలంగాణ రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించేందుకు ఉత్తమ క్రీడాకారులను ఎంపిక చేయడానికి ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ ఎంపిక పోటీల ద్వారా ప్రతిభ ఆధారంగా 15 మంది బాలురు, 15 మంది బాలికలను ఎంపిక చేసారు. టీపీసీసీ అధికార ప్రతినిధి, అడహాక్ కమిటీ కన్వీనర్ డా. సత్యం శ్రీరంగం అధ్యక్షతన వారి కార్యాలయంలో ఎంపిక ప్రక్రియకు సంబంధించి ఈ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అడహాక్ కమిటీ సభ్యులైన చిత్రా షెనాయ్, కృష్ణ రాజ్‌పుత్, భాస్కర్ రెడ్డి హాజరై సమావేశంలో చర్చించిన అనంతరం, క్రీడాకారుల ఎంపిక ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయడం జరిగిందని తెలిపారు.

ఉప్పల్ మున్సిపల్ మైదానంలో నేడు బతుకమ్మ వేడుకలు

మేడ్చల్, అక్టోబర్ 13(ది క్రైమ్ న్యూస్): ఉప్పల్‌లోని మున్సిపల్ మైదానంలో బుధవారం సాయంత్రం 6 గంటల నుంచి బతుకమ్మ వేడుకలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి నాచారం సర్కిల్ పరిధిలోని అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా హాజరుకావాలని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ నాచారం సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు అక్టోబర్ 13న సర్క్యులర్ విడుదల చేశారు. బతుకమ్మ పండుగ వేడుకల్లో అధికారులు, సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ఉప్పల్ జోన్ జోనల్ కమిషనర్ ఈ నెల 9న జారీ చేసిన ఉత్తర్వుల మేరకు ఈ ఆదేశాలు వెలువడ్డాయి.

ఉప్పల్ టీ20 మ్యాచ్‌కు భారీ భద్రతా ఏర్పాట్లు

2,200 మంది పోలీసులతో బందోబస్తు.. 408 సీసీ కెమెరాలు, రెండు డ్రోన్లతో నిఘా

8 వేల వాహనాలకు పార్కింగ్.. ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ప్రణాళిక

మేడ్చల్, అక్టోబర్ 12(ది క్రైమ్ న్యూస్) : ఉప్పల్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం వేదికగా భారత్, వెస్టిండీస్ జట్ల మధ్య బుధవారం జరగనున్న టీ20 మ్యాచ్‌కు మల్కాజిగిరి పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. మ్యాచ్‌ను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడంతోపాటు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నారు. శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణ, ప్రేక్షకుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తున్నట్లు మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి.సుమతి తెలిపారు. మ్యాచ్ సందర్భంగా మొత్తం 2,200 మంది పోలీసు, సహాయక భద్రతా సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. స్టేడియం పరిసరాల్లో నిరంతర నిఘా కొనసాగించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించనున్నారు. స్టేడియం లోపల, వెలుపల భద్రతను పర్యవేక్షించేందుకు 408 సీసీ కెమెరాలను ఏర్పాటు చేయగా, ప్రేక్షకుల రద్దీని నియంత్రించడం, ట్రాఫిక్ పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం కోసం రెండు డ్రోన్లను వినియోగించనున్నారు. ఆటగాళ్లు, మ్యాచ్ అధికారులు, ప్రేక్షకుల రక్షణ కోసం ప్రత్యేక భద్రతా బృందాలను రంగంలోకి దించుతున్నారు. అనుమానాస్పద వ్యక్తులు, కార్యకలాపాలపై నిఘా ఉంచడంతోపాటు నకిలీ టికెట్ల విక్రయాలను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. మ్యాచ్‌ను వీక్షించేందుకు వచ్చే ప్రేక్షకులకు ఇబ్బందులు కలగకుండా పార్కింగ్, రవాణా, ట్రాఫిక్ నిర్వహణపై పోలీసులు ప్రత్యేక ప్రణాళిక రూపొందించారు. మొత్తం 8 వేల వాహనాలకు పార్కింగ్ సదుపాయాలు కల్పించారు. ఉప్పల్, హబ్సిగూడ, తార్నాక, రామంతాపూర్, నాగోల్ ప్రాంతాల్లో మ్యాచ్ సమయంలో భారీగా వాహనాల రాకపోకలు జరిగే అవకాశం ఉండటంతో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ప్రత్యేక మార్గాలను సూచించారు. అవసరాన్ని బట్టి భారీ వాహనాలను ప్రత్యామ్నాయ మార్గాల్లోకి మళ్లించనున్నారు. అత్యవసర సేవలకు సంబంధించిన వాహనాల రాకపోకలకు ఎలాంటి అంతరాయం కలగకుండా తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. స్టేడియం పరిసరాల్లో మహిళల భద్రతకు కూడా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. మహిళలను వేధించే వారిపై నిఘా ఉంచేందుకు ఐదు ప్రత్యేక షీ టీమ్స్‌ను రంగంలోకి దించనున్నారు. మ్యాచ్ సందర్భంగా మత్తు పదార్థాల వినియోగాన్ని అరికట్టేందుకు ప్రత్యేక తనిఖీలు నిర్వహించనున్నారు. స్టేడియంలోకి వచ్చే ప్రేక్షకులు భద్రతా సిబ్బందికి సహకరించాలని, పోలీసుల సూచనలు పాటించాలని అధికారులు కోరుతున్నారు. మ్యాచ్ ముగిసిన అనంతరం ప్రేక్షకులు సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుకునేందుకు రవాణా సదుపాయాలను కూడా పెంచుతున్నారు. అదనపు ఆర్టీసీ బస్సులను నడపడంతోపాటు ప్రేక్షకుల రద్దీకి అనుగుణంగా మెట్రో రైలు సేవల సమయాన్ని పొడిగించేందుకు నిర్ణయం తీసుకున్నారు. మ్యాచ్‌ను వీక్షించేందుకు వచ్చే వారు చివరి నిమిషంలో రద్దీకి గురికాకుండా ముందుగానే స్టేడియానికి చేరుకోవాలని పోలీసులు సూచించారు. వ్యక్తిగత వాహనాల వినియోగాన్ని తగ్గించి, సాధ్యమైనంత వరకు మెట్రో రైళ్లు, ఆర్టీసీ బస్సులను ఉపయోగించాలని విజ్ఞప్తి చేశారు. ప్రేక్షకులందరూ నిబంధనలు పాటిస్తూ పోలీసులకు సహకరించాలని, మ్యాచ్ ప్రశాంతంగా జరిగేందుకు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పోలీస్ కమిషనర్ బి.సుమతి సూచించారు.

బాన్సువాడ మాతా శిశు ఆస్పత్రిలో వైద్యుల నిర్లక్ష్యం -గర్భంలోనే శిశు మృతి

వైద్యురాలు సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని బాధితుల ఫిర్యాదు

సీసీటీవీ ఫుటేజ్ పరిశీలించాలని డిమాండ్

సూపరింటెండెంట్ శ్రీనివాస్ కు ఫిర్యాదు

కామారెడ్డి జిల్లా ది క్రైమ్ న్యూస్ (ప్రతినిధి) : కామారెడ్డి జిల్లా బాన్సువాడ నియోజకవర్గం లోని బాన్సువాడ పట్టణంలో గల మాతా శిశు ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యం మరోసారి బయటపడింది. గర్భిణికి సకాలంలో వైద్యం అందించకపోవడంతో కడుపులోనే శిశువు మృతి చెందాడని బాధిత కుటుంబం ఆరోపిస్తూ సూపరింటెండెంట్ కు ఫిర్యాదు చేసింది. అసలేం జరిగింది బిచ్కుంద మండలం పుల్కల్ గ్రామానికి చెందిన నాగరాణి, భర్త హరీష్ పురోహిత్ కుటుంబీకుల కథనం ప్రకారం, అక్టోబర్ 9వ తేదీన నాగరాణికి పురిటి నొప్పులు రావడం, బిడ్డ కదలికలు లేకపోవడంతో బాన్సువాడ ఏరియా ఆసుపత్రికి తీసుకువచ్చారు. అక్కడ విధుల్లో ఉన్న వైద్యులు పరీక్షించి బిడ్డకు హృదయ స్పందన ఉందని చెప్పి ఒక గ్లూకోస్ సీసా ఎక్కించారు. ఆ తర్వాత గ్రంథస్తి (మాయ) సమస్యతో బిడ్డ కదలికలు లేకపోయినా వైద్యులు పట్టించుకోలేదని, స్పందించలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరిస్థితి విషమించడంతో వారు ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లగా, అక్కడ స్కానింగ్ చేసిన వైద్యులు అప్పటికే బిడ్డ మృతి చెందిందని నిర్ధారించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు. ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించిన బాన్సువాడ ఏరియా ఆసుపత్రి వైద్యురాలుపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని, అదే రోజు అక్టోబర్ 9న విధుల్లో ఉన్న నర్సులపై కూడా చర్యలు తీసుకోవాలని మంగళవారం నాడు ఆందోళన నిర్వహించారు. వైద్యురాలి నిర్లక్ష్యం వల్లే బిడ్డ చనిపోయిందని వారు ఆవేదన చెందారు. ఈ సందర్భంగా ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ కు లిఖితపూర్వక ఫిర్యాదు చేశారు. వాస్తవాలు తేలాలంటే అక్టోబర్ 9వ తేదీ మధ్యాహ్నం నాటి సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలించాలని కోరారు. వారి వెంట స్థానిక బీజేపీ నాయకులు శంకర్ గౌడ్, భాస్కర్ రెడ్డి తదితరులు ఉన్నారు. ఈ విషయమై సూపరింటెండెంట్ శ్రీనివాస్ విలేకరులతో మాట్లాడుతూ ఈ సంఘటన జరగడం బాధాకరమని, అయితే వారు ఆసుపత్రిలో 9న వచ్చి, ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే వెళ్లిపోయారని తెలిపారు. ఆసుపత్రిలో ఎలాంటి నిర్లక్ష్యం జరగలేదని పేర్కొన్నారు. అయినా పూర్తి స్థాయిలో విచారణ జరుపుతామన్నారు ఇటీవల కాలంలో బాన్సువాడ ఏరియా ఆసుపత్రిపై వరుస ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో ఈ ఘటన చర్చనీయాంశంగా మారింది. గత రెండు నెలల క్రితం ఆపరేషన్ చేయడంలో వైద్యుల నిర్లక్ష్యం కారణంగా నలుగురు బాలింతలు తీవ్రంగా అశ్వస్థత కు గురికావడం, చివరికి డయాలసిస్ చేయడం జరిగింది. ఈ సంఘటన రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయంశం అయింది. ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకున్నారు. అయినా వైద్యులు, సిబ్బందిలో ఎలాంటి మార్పులు రాకపోవడం మార్పు లేదు.

అనిల్ కుమార్ స్మారకంగా కమాన్ ఏర్పాటు

- కల్వచర్ల అంబేద్కర్ నగర్‌లో ప్రారంభించిన సర్పంచ్ రేండ్ల శారద కుమారస్వామి

రామగిరి, అక్టోబర్ 13(ది క్రైమ్ న్యూస్):- మండలంలోని కల్వచర్ల గ్రామానికి చెందిన బొంకూరి ఓదమ్మ--పోచం కుమారుడు, కీర్తిశేషులు బొంకూరి అనిల్ కుమార్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన స్మారకార్థం అంబేద్కర్ నగర్‌లో నిర్మించిన కమాన్ ను మంగళవారం గ్రామ సర్పంచ్ రేండ్ల శారద కుమారస్వామి ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె కమాన్‌ను ప్రారంభించి అనిల్ కుమార్ జ్ఞాపకాలను స్మరించుకున్నారు. అనిల్ కుమార్ స్మారకంగా ఏర్పాటు చేసిన కమాన్ ఆయనను ఎప్పటికీ గుర్తుచేసుకునేలా ఉంటుందని స్థానికులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మల్యాల పద్మ, కొయ్యడ పద్మ, రొడ్డ విజయ్, రేండ్ల కుమారస్వామి, కొట్టే నాగరాజు, వివిధ రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులు అంబేద్కర్ నగర్ కాలనీవాసులు, గ్రామ ప్రజలు, యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అద్దె కార్లను తనఖా పెట్టి రూ.14.50 లక్షలు స్వాహా

ఐదు కార్లను స్వాధీనం చేసుకున్న కీసర పోలీసులు.. నిందితుడి అరెస్ట్

మేడ్చల్, అక్టోబర్ 13(ది క్రైమ్ న్యూస్) : అద్దెకు తీసుకున్న కార్లను యజమానులకు తిరిగి ఇవ్వకుండా ఇతరుల వద్ద తనఖా పెట్టి లక్షల రూపాయలు పొందడంతోపాటు, వాహన బదిలీ కోసం నకిలీ పత్రాలు సృష్టించిన కేసులో ప్రధాన నిందితుడిని కీసర పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి ఐదు కార్లు, ఒక మొబైల్ ఫోన్, వాహన బదిలీకి ఉపయోగించిన అసలు ఫారం నంబర్ 35ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. కరీంగూడ గ్రామానికి చెందిన దాసరి బ్రహ్మానంద రెడ్డి తన మారుతి స్విఫ్ట్ డిజైర్ కారును ఆరు నెలల క్రితం రాంపల్లిలో హరిత టూర్స్ అండ్ ట్రావెల్స్ నిర్వహిస్తున్న వడ్డె మహేష్ (42)కు నెలకు రూ.35 వేల అద్దెకు ఇచ్చారు. మొదటి మూడు నెలలు అద్దె చెల్లించిన మహేష్ ఆ తర్వాత అద్దె చెల్లించకుండా కారును తిరిగి ఇవ్వలేదు. దీంతో యజమాని విచారించగా, తన కారును వట్టి అరుణ్ కుమార్ వద్ద తనఖా పెట్టి రూ.2 లక్షలు తీసుకున్నట్లు వెల్లడైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు సెప్టెంబర్ 4న కీసర పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో నిందితుడు ఇతరుల నుంచి కూడా కార్లను అద్దెకు తీసుకొని, యజమానుల అనుమతి లేకుండా తనఖా పెట్టడం, అక్రమంగా బదిలీ చేయడం ద్వారా డబ్బులు పొందినట్లు పోలీసులు గుర్తించారు. గణపూర్ గోపాలకృష్ణకు చెందిన ఎర్టిగా కారును సత్తిరెడ్డి వద్ద తనఖా పెట్టి రూ.1.50 లక్షలు పొందాడు. గుర్రం గౌతమ్ రెడ్డి కుటుంబానికి చెందిన స్విఫ్ట్ డిజైర్ కారు బదిలీ కోసం పరమేశ్వర్ రెడ్డి సంతకాన్ని ఫోర్జరీ చేసి ఫారం నంబర్ 35ను ఉపయోగించినట్లు గుర్తించారు. ఈ లావాదేవీలో సర్వర్ సనా పేరిట వాహన బదిలీకి సంబంధించి రూ.3 లక్షలు పొందినట్లు దర్యాప్తులో వెల్లడైంది. సండెన అబ్బులుకు చెందిన హ్యుందాయ్ వెన్యూ కారును నాగేశ్ వద్ద తనఖా పెట్టి రూ.3 లక్షలు, తెలుగు గౌరి శంకర్ కుటుంబానికి చెందిన ఎర్టిగా కారును అదే నాగేశ్ వద్ద తనఖా పెట్టి రూ.5 లక్షలు పొందినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఐదు కార్లకు సంబంధించిన లావాదేవీల ద్వారా మొత్తం రూ.14.50 లక్షలు పొందినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ఈ కేసులో ప్రధాన నిందితుడు వడ్డె మహేష్‌ను అక్టోబర్ 13న అరెస్ట్ చేసి, ఐదు కార్లతోపాటు మొబైల్ ఫోన్, అసలు ఫారం నంబర్ 35ను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిని న్యాయస్థానం ఎదుట హాజరుపరిచేందుకు చర్యలు చేపట్టారు. ప్రజలు తమ వాహనాలను అద్దెకు ఇచ్చే ముందు సంబంధిత వ్యక్తుల వివరాలు, ఒప్పంద పత్రాలు, వాహన వినియోగ నిబంధనలను పరిశీలించాలని కీసర పోలీసులు సూచించారు. వాహనాల అసలు పత్రాలు, బదిలీ పత్రాల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, తమ అనుమతి లేకుండా వాహనాలను తనఖా పెట్టడం లేదా బదిలీ చేయడం వంటి ఘటనలు గుర్తిస్తే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోరారు. జవహర్‌నగర్ ఏసీపీ ఎస్. చక్రపాణి మార్గదర్శకత్వంలో కీసర ఇన్‌స్పెక్టర్ బిక్కి రమేశ్, ఎస్ఐ అనిల్ కుమార్, కానిస్టేబుల్ శ్రీధర్ కేసును దర్యాప్తు చేసి నిందితుడిని అరెస్ట్ చేసినట్లు డీసీపీ సీహెచ్ శ్రీధర్ తెలిపారు.

ప్రైవేటీకరణకు కాంగ్రెస్, ఏఐటీయూసీ విధానాలే మూలం

లాభాల వాటా వెంటనే ప్రకటించాలి

ఏఎల్పీలో టీబీజీకేస్ బలోపేతం.. 150 మంది కార్మికుల చేరిక

'సింగరేణి కార్మిక గర్జన' సభను విజయవంతం చేయాలని పిలుపు

తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి

రామగిరి, అక్టోబర్ 13(ది క్రైమ్ న్యూస్):- సింగరేణి కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం పోరాటాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి స్పష్టం చేశారు. ఆర్జీ-త్రీ పరిధిలోని ఏఎల్పి గనిలో బుధవారం గోదావరిఖనిలో నిర్వహించనున్న "సింగరేణి కార్మిక గర్జన" బహిరంగ సభకు మద్దతుగా ఉదయం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సింగరేణి కార్మికుల హక్కులకు తీవ్ర నష్టం కలిగించిన వారసత్వ ఉద్యోగాలు, మెడికల్ బోర్డు విధానాల రద్దుకు ఐదు జాతీయ కార్మిక సంఘాలే ప్రధాన కారణమని ఆరోపించారు. 1998 జూన్ 6న జరిగిన ఎన్‌సీడబ్ల్యూఏ ఒప్పందంపై ఆయా జాతీయ సంఘాలు సంతకాలు చేయడం వల్లే కార్మికులు తమ వారసత్వ ఉద్యోగ హక్కును కోల్పోయారని విమర్శించారు. ప్రస్తుతం వేజ్ బోర్డు, ఎన్‌సీడబ్ల్యూఏ పేరుతో కార్మికులకు తామే జీతభత్యాలు తెచ్చిపెడుతున్నామని చెప్పుకునే సంఘాలు గతంలో కార్మికుల హక్కులను తాకట్టు పెట్టిన విషయాన్ని మరవొద్దని సూచించారు. దేశంలో ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ వేగవంతం కావడానికి కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలే కారణమని పేర్కొన్న ఆయన, తెలంగాణలో కూడా అదే ధోరణి కొనసాగుతోందన్నారు. ఆర్జీ ఓసీ-1లో గతంలో 50--60 శాతం వరకు మట్టి తొలగింపు పనులను సింగరేణి కార్మికులే నిర్వహించేవారని, ప్రస్తుతం ఆ పనులన్నింటినీ కాంట్రాక్టర్లకు అప్పగించి, కార్మికులను కేవలం బొగ్గు ఉత్పత్తికే పరిమితం చేస్తున్నారని ఆరోపించారు. ఇది దశలవారీ ప్రైవేటీకరణలో భాగమేనని, రాబోయే రోజుల్లో మరిన్ని విభాగాలను కూడా ప్రైవేటు చేతుల్లోకి అప్పగించే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రస్తుతం కూడా కార్మికులకు న్యాయమైన లాభాల వాటాను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యంపై ఒత్తిడి తీసుకురావడమే లక్ష్యంగా బుధవారం సాయంత్రం 5 గంటలకు గోదావరిఖని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహించే లిలి"సింగరేణి కార్మిక గర్జన"లిలి బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమస్యలు పరిష్కారం కాకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం టీబీజీకేఎస్ ఆర్జీ-త్రీ ఏపీఏ ఉపాధ్యక్షుడు నాగెల్లి సాంబయ్య , ఏఎల్పి పిట్ సెక్రటరీ వీవీ గౌడ్ ఆధ్వర్యంలో ఉదయం 5 గంటల ఫ్రీ షిఫ్ట్, 7 గంటల షిఫ్ట్‌లలో గేట్ మీటింగ్ నిర్వహించారు. బ్రాంచ్ సెక్రటరీ తిప్పారపు తేజ కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఫ్రీ షిఫ్ట్ నుంచి 70 మంది, 7 గంటల షిఫ్ట్ నుంచి 80 మంది కలిపి మొత్తం 150 మంది కార్మికులు టీబీజీకేస్‌లో చేరారు. వారిలో ముఖ్యంగా సాత్విక్, సతీష్ కుమార్, మహేష్, తిరుపతి, హుస్సేన్, సంపత్ కుమార్, సదన్, నరేష్, మహేందర్, సాయి, రామకృష్ణ, రాజేందర్, ఫయాజ్, శ్రవణ్, అవినాష్, మల్లేష్, సంతోష్, శంకర్, అరవింద్, వెంకన్న, రాజ్ కుమార్, వేణుగోపాల్, రాజేష్, ఆకాష్, శ్రీధర్, శివ, చిరంజీవి, ప్రశాంత్, విజయ్, శ్రీనివాస్, ఉపేందర్, సంపత్, శ్రీకాంత్, జక్కన్, కిరణ్, రమేష్, వీరయ్య తదితరులకు మిర్యాల రాజిరెడ్డి కండువాలు కప్పి యూనియన్‌లోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ పింగిలి సంపత్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ దేవ శ్రీనివాస్, సెంట్రల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఈసంపల్లి రమేష్, సెంట్రల్ కమిటీ సభ్యులు గట్టు శ్రీను , అసిస్టెంట్ పిట్ సెక్రటరీ కొప్పుల సురేష్ , పూసల శేఖర్, గోరె క్రాంతి, దొరగొళ్ల రాజేందర్, ఆర్గనైజింగ్ సెక్రటరీ పెరుక రమేష్ ,తమనేని వెంకటేష్ , రాజేష్, చిరంజీవి, మధు, కిరణ్, వేదవ్యాస్, సతీష్, ఆనంద్, రామరాజు, శ్రీనివాస్, నరేష్, బ్రాంచ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ చెమల్ల అబ్బయ్య, కమిటీ సభ్యులు మండమరి రమేష్, హుస్సేన్, మహేష్, తిరుపతి కుమార్, సదన్,రవి, శ్రీకాంత్, నరేష్,అనిల్ తదితరులు పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మ విగ్రహం ధ్వంసంపై రజక సంఘం తీవ్ర ఆగ్రహం

కరీంనగర్ టౌన్, అక్టోబర్13(ది క్రైమ్ న్యూస్)మెదక్ నగరంలో వీరనారి చిట్యాల చాకలి ఐలమ్మ విగ్రహాన్ని గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేయడాన్ని కరీంనగర్ జిల్లా రజక సంఘం తీవ్రంగా ఖండించింది. ఈ సందర్భంగా కరీంనగర్ జిల్లా రజక సంఘం అధ్యక్షులు రాచకొండ నరేష్ ఒక ప్రకటనలో మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు ఐలమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేయడం అత్యంత హేయమైన చర్య అని మండిపడ్డారు. తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక అయిన ఐలమ్మ విగ్రహాలపై ఇలాంటి దాడులు జరుగుతున్నాయంటే, ఆమె వారసత్వంపై మరియు రజక సమాజంపై ఒక పథకం ప్రకారం కుట్ర జరుగుతోందని భావించాల్సి వస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం మరియు పోలీస్ యంత్రాంగం ఈ ఘటనను తీవ్రంగా పరిగణించాలని ఆయన డిమాండ్ చేశారు. విగ్రహ ధ్వంసానికి పాల్పడిన దుండగులను తక్షణమే గుర్తించి, వారిపై కఠిన చట్టాల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. ఇకనైనా చిట్యాల ఐలమ్మ విగ్రహాల రక్షణకు ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని, అలాగే రాష్ట్రవ్యాప్తంగా రజక జాతిపై జరుగుతున్న దాడులు, దురాగతాలకు అడ్డుకట్ట వేసి రజకులకు రక్షణ కల్పించాలని రజక సంఘం తరఫున రాచకొండ నరేష్ డిమాండ్ చేశారు.

దుర్గామాత మండపాన్ని సందర్శించిన ఎమ్మెల్యే గంగుల కమలాకర్

శివాజీ యూత్ కమిటీ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం

కరీంనగర్ టౌన్, అక్టోబర్13(ది క్రైమ్ న్యూస్)నగరంలోని భగత్‌నగర్‌లో నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని శివాజీ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాన్ని మాజీ మంత్రి, కరీంనగర్ శాసనసభ్యులు గంగుల కమలాకర్ నేడు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం శివాజీ యూత్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆయన, భక్తులతో కలిసి కూర్చుని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా దుర్గాదేవి మండపం వద్దకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శివాజీ యూత్ ప్రతినిధులు, స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

చికిత్స కోసం ఎల్‌ఓసీ అందజేత

అనారోగ్యంతో బాధపడుతున్న ఎలువాక చంద్రయ్య కి మంత్రి శ్రీధర్ బాబు భరోసా

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చొరవతో ఎలువాక చంద్రయ్యకి వైద్య సహాయం

లక్ష యాభై వేల ఎల్‌ఓసీ మంజూరు చేయించిన మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు

రామగిరి, అక్టోబర్ 13(ది క్రైమ్ న్యూస్):- రామగిరి మండలంలోని ఆదివారంపేట గ్రామానికి చెందిన ఎలువక చంద్రయ్య కి తెలంగాణ రాష్ట్ర ఐటి ఉపరిశ్రమల, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు సీఎంఆర్ఎఫ్ ద్వారారూ లక్ష యాభై వేల ఎల్‌ఓసీ మంజూరు చేసి ఇప్పించారు. రామగిరి మండలంలోని ఆదివారంపేట గ్రామానికి చెందిన ఎలువక చంద్రయ్య నిమ్స్ ఆసుపత్రి లో అనారోగ్యంతో చికిత్స పొందుతున్నట్లు సహాయం కొరకు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కి తెలుపగా వెంటనే సీఎంఆర్ఎఫ్ ద్వారా వైద్య ఖర్చుల నిమిత్తశీ వీరికి లక్ష యాభై వేల ఎల్‌ఓసీ మంజూరు చేయించి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆస్పత్రి సహాయకులు హైదరాబాద్ లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో అందచేయడం జరిగింది. చికిత్స కోసం లక్ష యాభై వేల ఎల్‌ఓసీ మంజూరు చేపించి అండగా నిలిచినా మంత్రి శ్రీధర్ బాబుకి ఎలువక చంద్రయ్య కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

విశ్వజి

డయాబెటిస్ ఉంటే కొబ్బరినీళ్ళు తాగొచ్చా?

కొబ్బరి నీరు ఆరోగ్యానికి చాలా మంచిది. కొబ్బరి నీళ్లలో ఉండే హైడ్రేటింగ్ లక్షణాలు మరియు పోషక పదార్థాలు మన శరీరానికి కావలసిన శక్తినిస్తాయి. అయితే, మధుమేహం ఉన్నవారు కొబ్బరి నీళ్లు తాగొచ్చా? కొబ్బరి నీళ్లు తాగితే షుగర్ పెరుగుతుందా? వంటి అనుమానాలతో ఉంటారు . కొబ్బరి నీళ్లు తాగితే మధుమేహ వ్యాధిగ్రస్తుల రక్తంలో చక్కెర పెరుగుతుందా? తెలుసుకోవాలంటే ఈ కథనాన్ని చదవండి. కొబ్బరి నీళ్ళలో ఫుల్ పోషకాలు కొబ్బరి నీరు తక్కువ కేలరీలు కలిగి ఉంటుంది. కొబ్బరి నీళ్లలో సహజ చక్కెరలు, ఎలక్ట్రోలైట్లు మరియు ఖనిజాలు ఉంటాయి. ఇది పొటాషియం, మెగ్నీషియం మరియు విటమిన్ %జ% ని అందిస్తుంది. ఈ పోషకాలు మొత్తం ఆరోగ్యానికి మద్దతుని ఇస్తాయి. డయాబెటిస్ లేనివారికి కొబ్బరి నీళ్ళు మంచి పోషకాలతో కూడిన పానీయం. అయితే మధుమేహంతో బాధపడే వారు మాత్రం కొబ్బరి నీళ్ల విషయంలో కాస్త జాగ్రత్తగానే ఉండాలి. రక్తంలో చక్కెరపై ప్రభావం కొబ్బరి నీళ్లలో ఉండే సహజ చక్కెర కంటెంట్ కారణంగా ఇది రక్తంలో చక్కెరను నిదానంగా పెంచుతుంది. కొబ్బరి నీరు తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ కలిగి ఉండడం వల్ల రక్తంలో చక్కెరను నెమ్మదిగా పెంచుతుంది. అయితే, గ్లూకోజ్ స్థాయిలలో పెరుగుదలను నివారించడానికి కొబ్బరినీళ్ళ విషయంలో జాగ్రత్త పాటించడం అవసరం. %ూశీషవతీవస దీఎ% మధుమేహ రోగులకు కొబ్బరి నీళ్ళతో ప్రయోజనాలు, కానీ కొబ్బరి నీటిలోని ఎలక్ట్రోలైట్లు హైడ్రేషన్‌ను నిర్వహించడంలో సహాయపడతాయి. ఇది మధుమేహ వ్యాధిగ్రస్తులకు చాలా అవసరం. పొటాషియం రక్తపోటును నియంత్రించడం ద్వారా గుండె ఆరోగ్యాన్ని మద్దతు ఇస్తుంది. మెగ్నీషియం ఇన్సులిన్ సున్నితత్వానికి సహాయపడుతుంది, గ్లూకోజ్ నియంత్రణకు ప్రయోజనం కలిగిస్తుంది. మధుమేహ వ్యాధిగ్రస్తులకు కొబ్బరి నీళ్లను తాగితే ప్రయోజనాలు ఉంటాయి, కానీ బాగా ఎక్కువగా తాగడం మాత్రం మంచిది కాదు. ఇలా ఉంటే కొబ్బరి నీళ్ళు తాగొద్దు కొబ్బరి నీళ్లను తాగిన తర్వాత కూడా చక్కెర స్థాయిలను పర్యవేక్షించటం కూడా అవసరం.కొబ్బరి నీళ్ళను డయాబెటిస్ బాధితులు తీసుకోవాలి అనుకుంటే వైద్యుల సలహా మేరకు తీసుకుంటే మంచిది. డయాబెటిస్ బారిన పడిన, ముఖ్యంగా మూత్ర పిండాల సమస్యలతో ఇబ్బంది పడుతున్న వారు కొబ్బరి నీళ్ళ జోలికి వెళ్ళకుండా ఉంటేనే మంచిది.

కాస్మొటిక్స్‌తో కాదు ఈ ఆహారాలతో మీ చర్మానికి నిగారింపు.. ట్రై చెయ్యండి!

చాలామంది చర్మం అందంగా ఉండడం కోసం, ఆరోగ్యంగా ఉండడం కోసం రకరకాల ప్రయోగాలు చేస్తారు. చర్మం నికారింపును సొంతం చేసుకోవడానికి రకరకాల కాస్మొటిక్స్ ను ఉపయోగిస్తారు. అయితే ఎటువంటి సౌందర్య క్రీములు ఉపయోగించకుండా కేవలం మంచి ఆహారంతోనే చర్మం మెరిసిపోయేలా చేయవచ్చని చెబుతున్నారు వైద్య నిపుణులు. చర్మానికి ఆహారంతో పోషణ చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడానికి అవసరమైన పోషణ అందించడానికి కొన్ని ఆహారాలు ఎంతగానో దోహదం చేస్తాయని చెబుతున్నారు. చర్మ సౌందర్యాన్ని మరింత పెంచే, అద్భుతమైన నిగారింపును ఇచ్చే అటువంటి ఆహారం గురించి ప్రస్తుతం మనం తెలుసుకుందాం. మనం తినే ఆహారంలో పోషకాలు పుష్కలంగా ఉండే ఆహారాలు చర్మ ఆరోగ్యానికి దోహదం చేస్తాయి. అవకాడో చర్మం ఆరోగ్యంగా అందంగా ఉండాలంటే, నిగారింపును సొంతం చేసుకోవాలంటే అవకాడో ఎంతగానో దోహదం చేస్తుంది. అవకాడోలో విటమిన్ ఏ, విటమిన్ సి, విటమిన్ ఈ పుష్కలంగా లభిస్తాయి. ఇది మీ చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచుతాయి. ముఖం మీద ముడతలను నివారిస్తాయి. ఆకుకూరలు కూరగాయలు చర్మం ఆరోగ్యంగా ఉండడానికి ఆహారంలో బచ్చలికూరతో పాటు పాలకూర, తోటకూర వంటి ఆకుకూరలు ఎంతగానో దోహదం చేస్తాయి.ఇక ఆహారంలో గుమ్మడికాయ, దోసకాయ, టమాటా వంటి కూరగాయలు కూడా చర్మ ఆరోగ్యానికి ఉపయోగపడతాయి. వాటర్ కంటెంట్ ఎక్కువగా ఉండే పండ్లు, కూరగాయలను తింటే అవి చర్మాన్ని తేమగా ఉంచడంలో సహాయపడతాయి ఫలితంగా చర్మం నిగారింపును సొంతం చేసుకుంటుంది. నట్స్ మరియు సీడ్స్ బాదంపప్పు, జీడిపప్పు వంటి వివిధ రకాల డ్రై ఫ్రూట్స్ ను తింటే చర్మం నిగారింపును సొంతం చేసుకుంటుంది. బయోటిన్, ప్రోటీన్, విటమిన్ ఈ తో ఉన్న నట్స్, సీడ్స్ మన చర్మాన్ని రక్షిస్తాయి. వృద్ధాప్య ప్రభావాలను తగ్గిస్తాయి. నీరు ఎక్కువ తీసుకోవడం వయసు పెరిగే కొద్దీ చర్మం పైన ముడతలు సహజంగా వస్తూ ఉంటాయి. అయితే రోజు శరీరానికి కావాల్సినంత నీటిని ఇస్తే ఇవి ముడతలు రాకుండా చేసి చర్మం హైడ్రేటెడ్ గా బిగుతుగా ఉండేలా చూస్తాయి. మీరు ఎక్కువగా నీటిని తాగడం వల్ల రక్తప్రసరణ కూడా మెరుగు అవుతుంది. అంతేకాదు ఇది చర్మానికి నిగారింపును ఇస్తుంది.

పచ్చి బొప్పాయితో ఆరోగ్య అద్భుతాలు.. తెలిస్తే వదిలిపెట్టరు!



బొప్పాయి పండు మాత్రమే కాదు పచ్చి బొప్పాయి కాయ కూడా మనకు ఎంతో ఆరోగ్య ప్రయోజనాలను కలిగిస్తుంది. పచ్చి బొప్పాయి లో ఉండే పోషకాలు అన్ని ఇన్ని కాదు. పచ్చి బొప్పాయి లో కొవ్వులు, కార్బోహైడ్రేట్లను విచ్ఛిన్నం చేసే ఛైమో పాపైన్, పాపైన్ వంటి సహజ ఎంజైమ్స్ ఉంటాయి. పచ్చి బొప్పాయి కాయలో ఉండే ఫైబర్ న్యూట్రియంట్లు మన ఆరోగ్యానికి ఎంతగానో మేలు చేస్తాయి. పచ్చి బొప్పాయితో ఈ హెల్త్ బెనిఫిట్స్ పచ్చి బొప్పాయిలో యాంటీ ఆక్సిడెంట్ లు, విటమిన్లు మినరల్స్ పుష్కలంగా ఉంటాయి. పచ్చి బొప్పాయి తినడం వల్ల మన జీర్ణ ప్రక్రియ మెరుగుపడుతుంది. బొప్పాయి కాయ మన శరీరాన్ని శుభ్రం చేయడంలో ఎంతగానో దోహదం చేస్తుంది. గ్యాస్ సమస్యలను, అజీర్ణాన్ని, కడుపు ఉబ్బరాన్ని తగ్గిస్తుంది. పచ్చి బొప్పాయి కాయ మలబద్ధకాన్ని నివారిస్తుంది. మన శరీరంలో నుండి టాక్సిన్స్ ను బయటకు పంపుతుంది. పచ్చి బొప్పాయితో ఈ సమస్యలకు చెక్ పచ్చి బొప్పాయి కాయ మన శరీర కొత్త కణాలను నిర్మించడానికి వాటిని మరమ్మతు చేయడానికి ఎంతగానో దోహదం చేస్తుంది. గొంతు ఇన్ఫెక్షన్, శ్వాసకోశ ఇన్ఫెక్షన్, రుతుస్రావ సమస్యల వల్ల శరీరంలో కలిగే నొప్పులు, వాపులు, మంటలను పచ్చి బొప్పాయి కాయ సమర్థవంతంగా తగ్గిస్తుంది. పచ్చి బొప్పాయి గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది. పచ్చి బొప్పాయిలో పొటాషియం, ఫైబర్, ఫోలేట్ ఉంటాయి. పచ్చి బొప్పాయితో క్యాన్సర్ నుండి రక్షణ పచ్చి బొప్పాయి కాయ రక్తపోటుని తగ్గించడంతో పాటు గుండె జబ్బుల ప్రమాదాన్ని కూడా తగ్గించి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. పచ్చి బొప్పాయి కాయ మగవారికి ఎంతో ఉపయోగపడుతుంది. పురుషులలో వచ్చే ప్రోస్టేట్ క్యాన్సర్, పెద్ద పేగు క్యాన్సర్ వంటి క్యాన్సర్ల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఇందులో ఉండే డైటరీ ఫైబర్ పెద్ద పేగుల్లో ఉండే టాక్సిన్స్ ను బయటకు పంపుతుంది. 'ఆ డైరెక్టర్ వలలో చిక్కిన మోనాలిసా.. హీరోయిన్ ను చేస్తానని చెప్పి..' ఆహారంలో పచ్చి బొప్పాయితో మేలు ఇన్ని ఆరోగ్య ప్రయోజనాలను ఇచ్చే పచ్చి బొప్పాయి కాయను ఆహారంలో భాగంగా చేసుకుంటే ఎంతో మంచిది. పచ్చి బొప్పాయి కాయను కూరగా వండుకుని, పచ్చడి చేసుకుని, వివిధ రకాలుగా మనం ఆహారంలో భాగంగా చేసుకోవచ్చు.

మార్కెట్

అమల్లోకి ఫాస్టాగ్ కొత్త రూల్స్.. పాటించకపోతే అంతే సంగతులు

జాతీయ రహదారులపై ఫాస్టాగ్ లావాదేవీలకు సంబంధించి నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) కొత్త నిబంధనలు తీసుకువచ్చిన విషయం తెలిసిందే. టోల్ గేట్ల వద్ద లావాదేవీలు సులువుగా జరిగేలా, మోసాలు నివారించేలా తీసుకువచ్చిన ఈ నిబంధనలు నేటి నుంచి అమల్లోకి వచ్చాయి. కొత్త రూల్స్ ప్రకారం. వాహనం టోల్ బూత్‌కు చేరడానికి ముందు 60 నిమిషాల కంటే ఎక్కువ సేపు ఫాస్టాగ్ బ్లాక్‌లిస్ట్ అయి ఉన్నా, హాట్‌లిస్ట్‌లో ఉన్నా, బ్యాలెన్స్ తక్కువగా ఉన్నా టోల్ బూత్ వద్ద ఫాస్టాగ్ లావాదేవీ విఫలమవుతుంది. టోల్ బూత్ వద్ద స్కాన్ చేసిన తర్వాత 10 నిమిషాల వరకు ఫాస్టాగ్ ఇన్‌యాక్టివ్‌గా ఉన్నా లావాదేవీ తిరస్కరణకు గురవుతుంది. ఈ రెండు సందర్భాల్లో 176 ఎర్రర్ కోడ్‌తో లావాదేవీ విఫలమవుతుంది. ఇలా అయితే, వాహనానికి జరిమానా కింద రెట్టింపు టోల్ చార్జ్ పడుతుంది. ఈ రూల్స్‌కు అనుగుణంగా వాహనదారులు ముందుగానే జాగ్రత్త పడటం మంచిది. లేదంటే మీ జేబులకు చిల్లు పడటం ఖాయం.

పసిడి ప్రియులకు గుడ్‌న్యూస్.. భారీగా పతనమైన ధరలు..



హైదరాబాద్‌లో ధరలివే..!

పసిడి ప్రియులకు గుడ్‌న్యూస్. బంగారం ధరలు ఇటీవల గతంలో ఎన్నడూ లేనివిధంగా రికార్డు స్థాయికి చేరిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ధరలు దిగి వస్తున్నాయి. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడంతో స్టాకిస్టులు అమ్మకాలకు దిగుతున్నారు. ఐదురోజుల తర్వాత సోమవారం దేశ రాజధాని ఢిల్లీ నగరంలో బంగారం ధరలు ఆల్‌టైమ్ గరిష్ఠ స్థాయి నుంచి పతనమయ్యాయి. 24 క్యారెట్ల బంగారంపై రూ.900 తగ్గి తులానికి రూ.1,02,520కి చేరింది. అలాగే, 22 క్యారెట్ల గోల్డ్ ధర సైతం రూ.900 తగ్గడంతో తులానికి రూ.1,02,100కి చేరుకుంది. అయితే, బంగారం గత ఐదు ట్రేడింగ్ సెషన్లలో బంగారం ధర రూ.5800 పెరిగిందని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ ధ్రువీకరించింది. మార్కెట్‌లో బంగారానికి డిమాండ్ తగ్గడంతో ధర దిగివస్తుందని మార్కెట్ నిపుణులు పేర్కొంటున్నారు. రష్యా ఉక్రెయిన్ మధ్య యుద్ధం కొనసాగుతుండగా.. ట్రంప్ శాంతి ప్రయత్నాల నేపథ్యంలో చర్చలకు రష్యా అధ్యక్షుడు పుతిన్ అంగీకరించారు. అలాస్కాలో కలిసేందుకు అంగీకరించడంతో భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు స్వల్పంగా తగ్గుముఖం పట్టాయని, దాంతో విలువైన ఆస్తులకు డిమాండ్ తగ్గినట్లు హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ సీనియర్ విశ్లేషకుడు (కమోడిటీస్) సౌమిల్ గాంధీ పేర్కొన్నారు. గోల్డ్ బార్స్‌పై 39శాతం సుంకాలకు సంబంధించి వైట్‌హౌస్ స్పష్టతనివ్వడంతో ధరలపై ఒత్తిడి తెచ్చిందని తెలిపారు. సోమవారం వెండి ధర కిలోకు రూ.1000 తగ్గి రూ.1,14,000కి చేరుకుంది. వెండి సైతం గత ఐదురోజుల్లో కిలోకు రూ.2,500 పెరిగిన విషయం తెలిసిందే. న్యూయార్క్‌లో గోల్డ్ ఫ్యూచర్ ఔన్స్‌కు 40.61 డాలర్లు తగ్గి 3,358.17కి చేరుకుంది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో అక్టోబర్ కాంట్రాక్టుకు సంబంధించిన గోల్డ్ ఫ్యూచర్స్ 10 గ్రాములకు తగ్గి 1.26శాతం తగ్గి రూ.1,00,518 వద్ద ట్రేడవుతున్నది. కోటక్ సెక్యూరిటీస్‌లోని కమోడిటీ రీసెర్చ్ ఏవీపీ కైనత్ చైన్వాలా తెలిపిన ప్రకారం.. బంగారం ఒకశాతానికి తగ్గింది. గతవారంలో ధరల పెరుగుదల లాభాలన్నింటిని తుడిచిపెట్టేశాయి. బంగారం ఉత్పత్తులపై సుంకాలపై వచ్చిన వార్తలన్నీ తప్పుడు సమాచారంగా ట్రంప్ పరిపాలన పేర్కొనగా.. మార్కెట్ వర్గాలన్నీ మరింత స్పష్టత కోసం ఎదురుచూస్తున్నాయి. స్పాట్ సిల్వర్ 1.39 శాతం తగ్గి ఔన్సుకు 37.81 డాలర్లకు చేరింది. ఏంజెల్ వన్‌లో వ్యవసాయేతర వస్తువులు, కరెన్సీల డీవీపీ పరిశోధన నిపుణుడు ప్రథమేష్ మాల్యా మాట్లాడుతూ సుంకాలు ప్రపంచవ్యాప్తంగా గందరగోళాన్ని సృష్టించాయన్నారు. మరింత పెరిగితే అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధర మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ఔన్స్‌కు 3800 డాలర్ల వరకు చేరుకోవచ్చన్నారు. రాబోయే మూడు నెలల్లో ఎంసీఎక్స్ ఫ్యూచర్ పది గ్రాములకు రూ.1.10లక్షలకు చేరుకునే అవకాశం ఉందని చెప్పారు. ఇక హైదరాబాద్‌లో బంగారం ధరల విషయానికి వస్తే 24 క్యారెట్ల గోల్డ్ ధర రూ.1,02,280 పలుకుతుండగా.. 22 క్యారెట్ల పుత్తడి రూ.93,750గా ఉన్నది. కిలో వెండి రూ.1.27లక్షలు పలుకుతున్నది.

యాపిల్ కన్నా.. రిలయన్సే మిన్న

అత్యుత్తమ బ్రాండ్లలో ప్రపంచంలోనే రెండో స్థానం

ఫ్యూచర్‌బ్రాండ్ ఇండెక్స్‌లో చోటు దక్కించుకున్న ఏకైక భారతీయ సంస్థ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17: యాపిల్, నైక్ తదితర గ్లోబల్ దిగ్గజ బ్రాండ్లను వెనక్కునెట్టి భారతీయ సంస్థ రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ అత్యుత్తమ బ్రాండ్ల జాబితాలో దూసుకుపోయింది. తాజాగా విడుదలైన ఫ్యూచర్‌బ్రాండ్ ఇండెక్స్ 2024 లిస్టులో సామ్‌సంగ్ తర్వాత బెస్ట్ బ్రాండ్‌గా ముకేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ రెండో స్థానంలో నిలిచింది. ఆ తర్వాతే యాపిల్, నైక్, వాల్ట్ డిస్నీ, నెట్‌ఫ్లిక్స్, మైక్రోసాఫ్ట్, ఇంటెల్, టొయోటా వంటి ప్రముఖ సంస్థలుండటం గమనార్హం. కాగా, 2023తో పోల్చితే 2024లో సామ్‌సంగ్ 5వ స్థానం నుంచి నెంబర్ 1కు చేరింది. ఇక రిలయన్స్ 13 నుంచి 2కు వచ్చింది. అయితే యాపిల్ 1 నుంచి 3కు దిగజారింది. 2014లో అగ్రస్థానంలో ఉన్న గూగుల్.. 2024లో 57కు పడిపోయింది. మెటా కూడా 11 నుంచి 52కు దిగొచ్చింది. బోయింగ్, ఫోక్స్‌వాగన్ సంస్థలకైతే తాజా ర్యాంకింగ్స్‌లో చోటే లేకుండా పోయింది. ఇదిలావుంటే ఈసారి జాబితాలో రిలయన్స్ మినహా మరే ఇతర భారతీయ సంస్థలు లేవు. 'గడిచిన దశాబ్దానికిపైగా ఫ్యూచర్‌బ్రాండ్ ఇండెక్స్.. విజయవంతమైన బ్రాండ్లు మనుగడ సాగించడంపైనేగాక, నిలకడైన వృద్ధిని ఎలా నిలబెట్టుకుంటున్నాయో తెలియపరుస్తున్నది' అని నిర్వాహకులు ఈ సందర్భంగా అన్నారు. కాగా, ఫ్యూచర్‌బ్రాండ్ ఇండెక్స్.. ఓ వార్షిక అధ్యయనం. మార్కెట్ క్యాపిటలైజేషన్, మరికొన్ని అంశాల ద్వారా టాప్-100 కంపెనీలతో ఓ జాబితాను సిద్ధం చేస్తుంది.



ప్రభాస్ 'కల్కి 2' మూవీకి సాయి పల్లవి గ్రీన్ సిగ్నల్.. షూటింగ్ అప్‌డేట్!

పాన్-ఇండియా రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా, టాలెంటెడ్ డైరెక్టర్ నాగ్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న అత్యంత ప్రతిష్టాత్మక సీక్వెల్ చిత్రం 'కల్కి 2'కు సంబంధించి ఓ ఆసక్తికరమైన అప్‌డేట్ సినీ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. బాక్సాఫీస్ వద్ద సంచలన విజయం సాధించిన 'కల్కి 2898 ఏడీ' చిత్రానికి కొనసాగింపుగా వస్తున్న ఈ సీక్వెల్‌పై భారీ అంచనాలు ఉన్నాయి. అయితే ప్రభాస్ ఇతర సినిమాల కమిట్‌మెంట్ల కారణంగా ఈ ప్రాజెక్ట్ షూటింగ్ కొద్దిగా నెమ్మదిగా సాగుతున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ చిత్రంలో కీలకమైన పాత్ర కోసం ప్రముఖ నటి సాయి పల్లవి ఎంపికైన విషయం తెలిసిందే. వాస్తవానికి ఆమె ఈ అక్టోబర్ నెలలోనే సినిమా షూటింగ్ సెట్స్‌లో జాయిన్ కావాల్సి ఉండగా, మేకర్స్ ప్లాన్‌లో స్వల్ప మార్పులు జరిగినట్లు సమాచారం. ప్రస్తుతం సాయి పల్లవి తాను నటిస్తున్న 'రామాయణం' సినిమా ప్రమోషన్లు మరియు ఇతర కార్యక్రమాలపై పూర్తి దృష్టి పెట్టారు. ఈ పవిత్ర పౌరాణిక చిత్రం నవంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న నేపథ్యంలో, ఆ సినిమా రిలీజ్ ప్రక్రియ పూర్తయిన వెంటనే ఆమె 'కల్కి 2' షూటింగ్ షెడ్యూల్‌లో అడుగుపెట్టనున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే దీనిపై చిత్ర యూనిట్ నుంచి అధికారిక క్లారిటీ రానుంది.

ఆమెలో నాకు అదే నచ్చింది

కొత్త గర్ల్‌ఫ్రెండ్ గురించి చెప్పిన అమీర్‌ఖాన్

బాలీవుడ్ మిస్టర్ పర్ఫెక్షనిస్ట్ ఆమీర్ ఖాన్. సినిమాలతో పాటు తన వ్యక్తిగత జీవితంతోనూ నిత్యం వార్తల్లో నిలుస్తోన్న ఆయన ఇప్పుడు మరోసారి నెట్టింట ట్రెండ్ అవుతున్నారు. ఇప్పటికే రెండు సార్లు పెళ్లి చేసుకుని, తన ఇద్దరు భార్యలకు విడాకులు ఇచ్చేసిన ఆమిర్ ఖాన్ జీవితంలోకి మళ్లీ కొత్త ప్రేమ ప్రవేశించిందని వార్తలు వైరల్ అవుతున్నాయి. ఆమీర్ ఖాన్ ఓ యువతితో డేటింగ్ చేస్తున్నాడని టాక్ వినిపిస్తుంది. ఆమె పేరు గౌరి. ఆమీర్ ఖాన్ రీసెంట్ గా తన 60వ పుట్టినరోజు సందర్భంగా కొత్త స్నేహితురాలిని పరిచయం చేశాడు. ఇప్పుడు గౌరి ఆమిర్ ఖాన్ లో తనకు నచ్చిన విషయాన్ని వెల్లడించింది. ఈకామెంట్స్ ఇప్పుడు వైరల్ గా మారాయి. ముందుగా ఆమీర్ ఖాన్ మాట్లాడుతూ.. గౌరీలో తనకు నచ్చిన విషయాన్ని వెల్లడించాడు. 'నన్ను ప్రశాంతంగా ఉంచే, నాకు పీస్ ను ఇచ్చే భాగస్వామి కోసం నేను వెతుకుతున్నాను.' గౌరికి ఆ లక్షణాలు ఉన్నాయి అనిఆమీర్ ఖాన్ అన్నారు. అలాగే గౌరీ మాట్లాడుతూ.. 'నాకు మంచి వాడు, సౌమ్యుడైన, శ్రద్ధగల వ్యక్తి అవసరం.' "అప్పుడు నేను ఆమీర్ ఖాన్ ను కలిశాను" అని గౌరి తెలిపింది. ఆమీర్ ఖాన్ , గౌరీ 25 సంవత్సరాలుగా ఒకరికొకరు తెలుసు. 25 సంవత్సరాలుగా తెలిసినప్పటికీ ఇద్దరి మధ్య అంతగా మాటలు ఉండేవి కాదు. "మేము ఒకటిన్నర సంవత్సరం క్రితం మళ్ళీ పరిచయమయ్యాము" అని ఆమీర్ ఖాన్ అన్నారు. గౌరి బెంగళూరులో పెరిగింది. అతను సౌత్ సినిమాల అభిమాని. ఆమె పెద్దగా హిందీ సినిమాలు చూడలేదు. గౌరీ ఏడాది క్రితం ఆమీర్ నటించిన 'దిల్ చాహ్తా హై', 'లగాన్' సినిమాలు చూసిందట. ఇక ఆమీర్ ఖాన్ మార్చి 14, 1965న జన్మించాడు. అదేవిధంగా, గౌరి ఆగస్టు 21, 1978న జన్మించింది. ఇద్దరి మధ్య దాదాపు 14 సంవత్సరాలగ్యాప్ ఉంది. ఈ విషయం గురించి బాలీవుడ్ లో చాలా చర్చ జరుగుతోంది.

క్రికెటర్‌తో ప్రేమలో తమన్నా!!

తమన్నా గురించి సౌత్ ప్రేక్షకులకు ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. తన అందం, అభినయంతో తనకంటూ ప్రత్యేక పేరు సంపాదించుకుంది. ఈ క్రమంలో గతంలో ఈ హీరోయిన్ గురించి వైరల్ అయిన ఒక వార్త ఇప్పుడు మరోసారి సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. సౌత్ ఇండియాలో అన్ని భాషల్లో నటించింది హీరోయిన్ తమన్నా. ఇక సౌత్ లోనే కాకుండా నార్త్ లో కూడా తనకంటూ మంచి పేరు సంపాదించుకుంది. ముఖ్యంగా తమిళ, తెలుగు ఇండస్ట్రీలో ఎంతోమంది అభిమానులను సంపాదించుకుంది ఈ హీరోయిన్. ప్రస్తుతం సినిమాలతోనే కాకుండా డిజిటల్ శ్రీను ఏరియాలో కూడా వెబ్ సిరీస్ తో తన హవా కొనసాగిస్తుంది. ఇక తమన్నా గత కొద్దిరోజులు నుంచి విజయవర్మతో ప్రేమలో ఉన్న సంగతి తెలిసిందే. వీరిద్దరూ తమ ప్రేమని అధికారికంగా వెల్లడించడమే కాకుండా ఎన్నో ఈవెంట్స్ లో కలిసి కనిపించి మీడియా ముందర హల్చల్ చేశారు. కానీ ఏమైందో ఏమో తెలియదు కానీ కొద్దిరోజుల నుంచి మాత్రం వీరిద్దరూ బ్రేకప్ అయ్యారు అనే వార్త తెగ వైరల్ అవుతుంది. అయితే తమన్నా గురించి రూమర్స్ కొత్తేమీ కాదు. గతంలో కూడా ఒక పెద్ద రూమర్ తెగ వైరల్ అయింది. అదేమిటి అంటే స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ.. తమన్నా అప్పట్లో ప్రేమించుకున్నారు అని తెగ వినిపించింది. అయితే వీరిద్దరూ కూడా ఈ విషయం గురించి ఎప్పుడూ అధికారికంగా వెల్లదించలేదు. ఇక ఆ తరువాత కొన్ని విభేదాలు వల్ల విరిపోయారని అప్పుడే విరాట్ కోహ్లీ అనుష్క శర్మతో ప్రేమలో పడి పెళ్లి చేసుకున్నారు అన్న వార్తలు వచ్చాయి.. టిల్లో నిజం ఎంతుందో తెలియదు కానీ ఈ మధ్య విరాట్ కోహ్లీ పేరు సోషల్ మీడియాలో ట్రెండింగ్ అవుతున్న సమయంలో.. ఈ రూమర్ కూడా మరోసారి వినిపిస్తోంది.

యూత్‌ఫుల్ రొమాంటిక్ కామెడీ ఎంటర్టైనర్ 'వర్జిన్ బాయ్స్'

ఫ్యామిలీతో చూసే సినిమాలు కొన్ని ఉంటే... స్నేహితులతో కలిసి చూసే ఫిలిమ్స్ కొన్ని ఉంటాయి. యూత్ చూసే మూవీస్ కొన్ని ఉంటాయి. 'వర్జిన్ బాయ్స్' అయితే యూత్ చూసే సినిమా అని చెప్పాలి. గీతానంద్, మిత్రా శర్మ హీరో హీరోయిన్లుగా నటించిన సినిమా 'వర్జిన్ బాయ్స్'. ఇందులో శ్రీహాన్, రోనీత్, జెన్నిఫర్, అన్షులా, సుజిత్ కుమార్, అభిలాష్ ఇతర ప్రధాన తారాగణం. ఇదొక యూత్‌ఫుల్ రొమాంటిక్ కామెడీ. ఈ సినిమాకు దయానంద్ దర్శకత్వం వహించారు. రాజ్ గురు ఫిల్మ్స్ పతాకం మీద రాజా దరపునేని ప్రొడ్యూస్ చేశారు. ఈ మూవీ టీజర్ తాజాగా రిలీజ్ అయ్యింది. అవుట్ అండ్ అవుట్ యూత్ ఫుల్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా 'వర్జిన్ బాయ్స్'ను తీసినట్టు టీజర్ చూస్తుంటే అర్థం అవుతోంది. రొమాన్స్ అండ్ అడల్ట్ కామెడీని గట్టిగా దట్టించారు. స్మరణ్ సాయి సంగీతం టీజర్‌లో జోష్ పెంచగా... వెంకట ప్రసాద్ సినిమాటోగ్రఫీ ఎనర్జిటిక్‌గా కనిపిస్తోంది. గీతా నంద్, మిత్రా శర్మ మధ్య కెమిస్ట్రీ యూత్ ఆడియన్స్ అందరినీ ఆకట్టుకునేలా ఉంది. మోడ్రన్, న్యూ ఏజ్ కాలేజీ లైఫ్ - యూత్ లైఫ్ స్టైల్ చూపించే సినిమా అని అర్థం అవుతోంది. 'బిగ్ బాస్' ఫేమ్ శ్రీహాన్ క్యారెక్టర్ - కామెడీ టైమింగ్ జనాలకు నచ్చేలా ఉంది. వేసవిలో 'వర్జిన్ బాయ్స్'ను థియేటర్లలోకి తీసుకు రావడానికి సన్నాహాలు చేస్తున్నారు. 'వర్జిన్ బాయ్స్' నిర్మాత రాజా దరపునేని మాట్లాడుతూ... "యూత్ అందరికీ కనెక్ట్ అయ్యేలా మా సినిమాను తీర్చిదిద్దాం. యూత్ ఫుల్ సినిమాలకు భిన్నంగా కొత్త కథతో ఈ సినిమా తీశాం. రొటీన్ మూవీ అన్నట్టు కాకుండా మిగతా సినిమాలకు భిన్నంగా ఉంటుందీ సినిమా" అని చెప్పారు.

ఓటీటీలోకి హిట్ 3..

యువ హీరో నాని లీడ్ రోల్‌లో నటించిన తాజా చిత్రం హిట్-3: ది థర్డ్ కేస్ థియేటర్లలో ఘన విజయం సాధించడంతో ఇప్పుడు ఈ సినిమా ఓటీటీ రిలీజ్‌పై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. హిట్ సిరీస్‌లో మూడో భాగంగా విడుదలైన ఈ సినిమాకు శైలేష్ కొలను దర్శకత్వం వహించారు. వాల్‌పోస్టర్ సినిమా, యూనానిమస్ ప్రొడక్షన్స్ బ్యానర్‌లపై ప్రశాంతి త్రిపిర్నేని, నానిలు ఈ చిత్రాన్ని నిర్మించారు. రివిలీజ్‌కి ముందే టీజర్స్, పోస్టర్లు, ట్రైలర్ ద్వారా భారీ అంచనాలు ఏర్పడిన ఈ సినిమా, మే 1న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదలైంది. విడుదలైన తొలి షో నుంచే బ్లాక్ బస్టర్ టాక్‌తో దూసుకెళ్తున్న ఈ మూవీ, బాక్సాఫీస్ వద్ద 100 కోట్లకు పైగా వసూళ్లు సాధించింది. కొంతమంది విమర్శకులు సినిమాలో రక్తపాతం, హింస అధికంగా ఉన్నట్లు వ్యాఖ్యానించినప్పటికీ, నాని క్రేజ్ వల్ల ప్రేక్షకులు సినిమాను ఆదరిస్తున్నారు. ప్రస్తుతం చాలా థియేటర్లలో ఈ సినిమాకు హౌస్‌ఫుల్ కలెక్షన్లు వస్తుండటంతో చిత్ర బృందం ఇటీవలే సక్సెస్ మీట్ నిర్వహించింది. ఇక ఈ సినిమా ఓటీటీలో ఎప్పుడెప్పుడు వస్తుందా అని సినీ ప్రేమికులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజా సమాచారం మేరకు, నెట్‌ఫ్లిక్స్ హిట్-3 డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను దక్కించుకున్నట్లు తెలుస్తోంది.

భారీ హిట్ దిశగా సింగిల్

చిన్న సినిమాగా వచ్చి సంచలన విజయం సాధించింది సింగిల్. కింగ్ ఆఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ శ్రీవిష్ణు హీరోగా కేతికా శర్మ, ఇవానా హీరోయిన్లుగా నటించారు. మెగా ప్రొడ్యూసర్ అల్లు అరవింద్ సమర్పణలో కార్తీక్ రాజు దర్శకత్వం వహించగా.. గీతా ఆర్ట్స్, కళ్యా ఫిల్మ్స్ పతాకాలపై విద్య కొప్పినీడి, భాను ప్రతాప, రియాజ్ చౌదరిలు సంయుక్తంగా సింగిల్ చిత్రాన్ని నిర్మించారు. వెన్నెల కిశోర్, వీటీవీ గణేష్, కల్పలత తదితరులు ఇతర కీలకపాత్రలు పోషించారు. సింగిల్ సినిమా బడ్జెట్ ఎంత? ప్రీ రిలీజ్ బిజినెస్ ఎంత? ఐదు రోజుల్లో ఈ సినిమా ఎన్ని కోట్లు వసూలు చేసింది ? అనే వివరాల్లోకి వెళితే.. సింగిల్ చిత్రాన్ని సుమారుగా 15 కోట్ల రూపాయల బడ్జెట్‌తో రూపొందించగా, ఈ సినిమాకు దాదాపు 7 కోట్ల రూపాయలు జరిగినట్లుగా ఫిలింనగర్ వర్గాలు తెలిపాయి. సింగిల్ చిత్రం లాభాల్లోకి రావాలంటే రూ.8 కోట్ల షేర్.. రూ.16 కోట్ల గ్రాస్ వసూలు చేయాలని ట్రేడ్ పండితులు విలువ కట్టారు. మే 9న సుమారుగా తెలుగు రాష్ట్రాల్లో 400 స్క్రీన్లలో, ప్రపంచవ్యాప్తంగా 700 స్క్రీన్లలో సింగిల్ సినిమాను రిలీజ్ చేశారు. సింగిల్ మూవీకి తొలి రోజు ఇండియాలో రూ.2.5 కోట్ల ఓపెనింగ్స్ రాగా.. ప్రపంచవ్యాప్తంగా రూ.4.15 కోట్ల వసూళ్లు వచ్చినట్లు ట్రేడ్ వర్గాలు తెలిపాయి. హీరో శ్రీవిష్ణు కెరీర్‌లో అత్యధిక ఓపెనింగ్స్ రాబట్టిన సినిమాగా సింగిల్ నిలిచింది. ఆ తర్వాత రెండో రోజు రూ.3.5 కోట్ల నెట్, మూడో రోజు రూ.3.55 కోట్ల నెట్, నాలుగో రోజు రూ.1.7 కోట్ల చొప్పున నాలుగు రోజుల్లో సింగిల్ మూవీ రూ.11 కోట్ల నికర వసూళ్లు సాధించింది. యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కిన సింగిల్ మూవీకి యువత బ్రహ్మరథం పడుతున్నారు. శ్రీవిష్ణు - వెన్నెల కిషోర్ కామెడీతో థియేటర్‌లో ప్రేక్షకులు పడిపడి నవ్వుకుంటున్నారు. ఐదో రోజైన మంగళవారం సింగిల్ మూవీకి 24.34 శాతం థియేట్రికల్ ఆక్యుపెన్సీ నమోదైనట్లు సాక్‌నిల్క్ తెలిపింది. ఐదో రోజు హైదరాబాద్‌లో 328, బెంగళూరులో 155, విజయవాడలో 99, విశాఖలో 119 షోలు పడినట్లు వెల్లడించింది. మంగళవారం సింగిల్ మూవీ ఇండియాలో నికరంగా రూ.1.33 కోట్లు రాబట్టింది.

Printed, Published & Owned by Dr. JBL, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S), RNI NO. APTEL/2006/19056